

SB
SURYA BOOKS
Surya's
బాడీ
ల్యాంగ్వేజ్
డి.సుబ్రహ్మణ్య శర్మ

# బాడీ ల్యాంగ్వేజ్

రచయిత

**డి.ఎ.ఎస్. శర్మ**

Surya BOOKS

**సూర్యా**
**బాడీ ల్యాంగ్వేజ్**

First Edition : 2006.

Price : **Rs. 50/-**

*Publishers :*
**Victory Publishers**
**Regd. Office :** # 11-16-32 (A), Singarajuvari Veedhi,
Kothapeta, **VIJAYAWADA - 520 001** ✆ 5563733.
**Admn. Office :** # 29-28-40 Dasarivari Veedhi, Suryarao Pet,
**VIJAYAWADA - 2**, ✆ 5513735, 5513734.

We have made many efforts to present this book without errors. But some errors might have crept in. We do not take any legal responsibility for such errors and omissions. If you bring them to our notice we shall correct them in our next edition. All disputes are subject to Vijayawada Jurisdiction only.



## రచయిత గురించి

కథకుడు, నాటక రచయిత, వ్యాకరణ గ్రంథకర్త, సాహిత్య విమర్శకుడు, చిత్ర కారుడు **శ్రీ డి.ఎ. సుబ్రహ్మణ్య శర్మ** 1939లో తూర్పు గోదావరి జిల్లా, తునిలో జన్మించారు.

1964లో ఆంధ్రా యూనివర్శిటి నుండి ఆంగ్లంలో ఎం.ఏ. డిగ్రీ పొంది, ఉన్నత విద్యాశాఖలో చేరి, 33 సంవత్సరాలు ఆంగ్లోపన్యాసకుడిగా వివిధ ప్రభుత్వ కళాశాలల్లో పనిచేశారు. వేలాది విద్యార్థుల హృదయాల్లో ఒక మంచి వ్యక్తిగా, ప్రతిభావంతు డయిన ఉపన్యాసకుడిగా పదిలమైన స్థానాన్ని సంపాదించుకొన్నాడు.

ఉద్యోగ విరమణానంతరం రచనా వ్యాసంగంలో పూర్తిగా నిమగ్నమైపోయారు. వీరు రచించిన అనేకానేక కథలు ప్రముఖ వారపత్రికల్లో ప్రచురించబడ్డాయి. వీరి నాటికల్ని, ప్రసంగాల్ని ఆకాశవాణి విజయవాడ కేంద్రం పలుమార్లు ప్రసారం చేసింది.

వీరు రచించిన 'బాడీ ల్యాంగ్వేజ్' మనుషుల మనోభావాల్ని శరీర కదలికలు ఎలా తెలియచేస్తాయో పాఠకులకు సులభశైలిలో తెలియచేస్తుంది.

# విషయసూచిక


1. శరీరం మాట్లాడుతుంది ! 1
2. అధ్యయన స్థలాలు 2
3. హావభావాలు 6
4. నడకతీరు 10
5. కరచాలనాలు 13
6. స్వభావాలు 17
7. అంచనాలు 26
8. భావావేశాలు 31
9. మానసిక ప్రవృత్తులు 36
10. వీటి గురించి తెలుసుకోండి 40
11. ప్రేమాయణం 45
12. అఫీషియల్‌డమ్ 49
13. ఫంక్షన్లో మనుషులు 55
14. చిన్న పరీక్ష 63
15. ఇంటర్వ్యూలు 66

కృతజ్ఞతలు 71

# ముందుమాట

**ఈ** మధ్య కాలంలో–బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన పదం బాడీ ల్యాంగ్వేజ్.

క్రికెట్ కామెంటేటర్స్ ఆటగాళ్ల బాడీల్యాంగ్వేజ్ గురించి చర్చిస్తుంటారు.

న్యూస్ రిపోర్టర్స్ రాజకీయ నాయకుల బాడీల్యాంగ్వేజ్ గురించి తెలియ చేస్తూంటారు.

టి.వి. ఏంకర్స్ నటీనటుల బాడీ ల్యాంగ్వేజ్ గురించి ప్రస్తావిస్తూంటారు.

మరి బాడీ లేంగ్వేజ్ అంటే ఏమిటి?

శరీర కదలికల్ని బట్టి మనుషుల మనోభావాల్ని తెలిపే భాషనే బాడీ ల్యాంగ్వేజ్ అంటారు.

శరీరంలోని వివిధ భాగాలు – ముఖ్యంగా ముఖం, చేతులు, కాళ్లు – మాటలకందని భావాల్ని తెలియచేస్తూంటాయి.

ఈ భాషని తెలిసున్న వాళ్లు మనుషుల్ని పుస్తకాల్ని చదివినట్టు చదవగలరు.

వాద ప్రతివాదనలలోనూ, చర్చా గోష్ఠులలోనూ తమదే పైచేయి అనిపించుకోగలరు.

అవతలి వాళ్లు అబద్ధాలాడుతూన్నా, నటిస్తూన్నా, ఇట్టే పసిగట్టి, అందుకు తగ్గట్టుగా వ్యవహరించగలరు.

ఇతరులు పంపే స్నేహసంకేతాల్ని, ప్రేమసంకేతాల్నీ, అర్థం చేసుకొని అందుకనుగుణంగా ప్రవర్తించగలరు.

అవతలి వ్యక్తి తమపట్ల విసుగుదలతో ఉన్నా, తిరస్కారభావంతో ఉన్నా, సమయానుకూలంగా వ్యవహరించి, తలపెట్టిన పనిని సానుకూలం చేసుకోగలరు.

ఈ భాషని గురించి తెలియనివాళ్ళు తలపెట్టిన కార్యాన్ని సానుకూలం చేసుకోడానికి తెగ అవస్థ పడుతూంటారు. బాడీ లేంగ్వేజ్ మీద ఆంగ్లభాషలో అనేక ప్రామాణిక గ్రంథాలొచ్చాయి.

కాని తెలుగులో వచ్చినట్టు లేదు.

ఆ లోపాన్ని పూరించడానికి చేసిన చిన్న ప్రయత్నమే ఇది.

**- రచయిత**

# 1 శరీరం మాట్లాడుతుంది !

**ఒ**క వ్యక్తి కొత్తగా ఉద్యోగంలో చేరేడనుకోండి. నిటారుగా నిలబడి తన ఉద్యోగ విధుల్ని నిర్వహిస్తాడు. అతనికి ఉద్యోగంలో ప్రమోషన్ వచ్చిందనుకోండి. ఠీవిగా నిలబడి తన ఉద్యోగ విధుల్ని నిర్వహిస్తాడు. చాలా కాలంగా ఉద్యోగం చేస్తూ అనుభవంతో పండిపోయేడనుకోండి.

పై అధికారుల పట్ల అణకువతో ప్రవర్తించాలనే ఇంగితజ్ఞానంతో – ఎప్పుడూ ముందుకు వంగి నడుస్తూ – అధికారులకి సలాములు చేస్తూంటాడు.

ఇదే – బాడీ లేంగ్వేజంటే.

బాడీ లేంగ్వేజంటే శరీరం మాటాడే భాషని అర్థం చెప్పుకోవచ్చు.

ఈ భాషని తెలిసున్నవాళ్లు మనుషుల్ని పుస్తకాన్ని చదివినట్టు చదవగలరు.

అవతలివాళ్లు నటిస్తూన్నా – అబద్ధాలాడుతున్నా – ఇట్టే పసిగట్టేసి – అందుకు తగ్గట్టుగా వ్యవహరిస్తారు.

అవతలివాళ్లు పంపే స్నేహ సంకేతాల్నీ ప్రేమ సంకేతాల్నీ అర్థం చేసుకొని పరిచయాలు పెంచుకొంటారు.

అవతలివాళ్ల మనోగతాన్ని అర్థం చేసుకొని – అందుకు తగ్గట్టుగా వ్యవహరిస్తూ – తామనుకొన్నది సాధిస్తారు.

సున్నితమైన సమస్యల్ని అతి సులువుగా పరిష్కరిస్తారు.

జీవితంలో విజయసోపానాల్ని అతిసులభంగా అధిరోహిస్తారు.

మరి మీరూ మీరెంచుకున్న రంగాల్లో విజేతలు కావాలనుకొంటున్నారా?

అయితే బాడీ లేంగ్వేజ్ గురించి తెలుసుకోండి.

# 2 అధ్యయన స్థలాలు

పుస్తకాల్ని చదివితే జ్ఞానాన్ని పొందవచ్చు. కానీ –

ప్రాపంచిక జ్ఞానాన్ని పొందాలంటే – మనుషుల్ని చదవడం నేర్చుకోవాలి.

జీవితంలో విజయం సాధించాలంటే ప్రాపంచిక జ్ఞానం చాలా అవసరం.

మరి – మనుషుల్ని చదవడం అంటే ఏమిటి?

మనుషుల శరీర కదలికల్ని బట్టి వారి మనోభావాల్ని తెలుసుకోగలగడమే – మనుషుల్ని చదవడం అంటే.

శరీర భాషని తెలిసున్నవాళ్లకి ఇది వీలుపడుతుంది.

నలుగురు చేరే స్థలాలన్నీ ఈ భాషని అధ్యయనం చెయ్యడానికి అనువైన స్థలాలే ! ఎయిర్‌పోర్ట్, రైల్వేస్టేషన్, బస్టాండు, పోస్టాఫీసు, గవర్నమెంటు ఆఫీసు, లైబ్రరీ మొదలైనవన్నీ అధ్యయన స్థలాలే.

రకరకాల మనుషుల్ని చదవడానికి రైల్వే స్టేషన్ చాలా అనువైన స్థలం.

రైల్వే స్టేషన్‌కి వెళ్దాం పదండి.

వచ్చే పోయే ట్రెయిన్స్‌తో చాలా హడావుడిగా ఉంది కదూ –

కంపార్ట్‌మెంట్స్‌లోకి తోసుకొంటూ ఎక్కే ప్రయాణీకుల్ని గమనించారా?

వాళ్ల మొహాలు చాలా సీరియస్‌గా ఉన్నాయి కదూ –

ట్రెయిన్ కదలేలోగా పిల్లల్తోటీ, సామాన్లతోటీ లోపలికెక్కగలమా – లేదా – అన్నదే వాళ్ల ఆందోళన.

కంపార్ట్‌మెంట్లలోంచి తోసుకొస్తున్న ప్రయాణీకుల్ని తప్పించుకొని కిందకి

దిగిన ప్రయాణీకుల్ని చూశారా?

వాళ్ల మొహాల్లో 'అమ్మయ్య! మనూరి కొచ్చేశాం! అన్న ఆనందం తాండవించడం లేదూ?

మీకు కొద్ది దూరంలో – బెంచీమీద ఒకమ్మాయి కూర్చుని ఉంది.

పదహారేళ్లుండొచ్చు. ఉన్నట్లుండి లేచి మళ్ళీ కూచుంటోంది! అంటే ఎవరి కోసమో ఎదురు చూస్తోందన్నమాట.

కొద్దిగా అవతల – ఒక నడివయస్సుతను కూర్చుని ఉన్నాడు.

బిగుసుకుపోయినట్టు కూచున్నాడు.

కాళ్లెడంగా పెట్టి – పాదాల్ని ఒకదానితో మరొకదాన్ని క్రాస్ చేసి – కూచున్నాడు. చేతివేళ్లు ఒకదానితో మరొకటి ముడిపడ్డట్టుగా ఉన్నాయి. బొటన వేళ్లని ఒకదానితో మరొకదాన్ని అదే పనిగా రాపాడిస్తున్నాడు.

ఇతని శరీర కదలికల్ని బట్టి మనకు తెలిసేదేమిటంటే – ఇతను ప్రతిదానికీ ఆందోళన చెందుతూంటాడు. ఏ విషయం గురించీ ఒక పట్టాన నిర్ణయం తీసుకోలేడు. ప్రస్తుతం ప్రయాణం చేద్దామా మానుకొందామా అనే మీమాంసలో ఉన్నాడు.

ఇంకొంచెం దూరం నడుద్దాం.

ఇక్కడ హడావిడి అంతగా లేదు కదా –

ఎదురుగ్గా మూడు టెలిఫోన్ బూత్స్ కనిపిస్తున్నాయి.


లోపల మనుషులు మాటాడుతున్నారు.

మొదటి బూత్‌లో ఉన్నతను (బొమ్మ 1) ఎటెన్షన్ ఫోజులో నుంచుని మాటాడుతున్నాడు. సూట్లో నీట్‌గా ఉన్నాడు. అతను నిలుచున్న పద్ధతీ మాటాడే తీరూ చూస్తోంటే –



1. Salesman - సేల్స్‌మెన్


అతనెవరో అతి ముఖ్యుడితో మాటాడుతూన్నట్లనిపిస్తోంది.



2. The husband
ప్రాణనాథుడు

బహుశా అతను సేల్స్‌మన్ కావచ్చు. అతను మాటాడుతున్నది కస్టమర్‌తో అయ్యుండొచ్చు. కస్టమర్ తన ఎదురుగా ఉన్నట్టుగా ఊహించుకొని మాటాడుతున్నట్టుగా ఉంది అతని పద్ధతి.

ఇక – రెండవ బూత్‌లో మాటాడుతున్నతను (బొమ్మ 2) చాలా రిలేక్స్‌డ్‌గా కనిపిస్తున్నాడు. కాళ్లెడంగా ఉంచి – తల ఒక వైపుకి వంచి మాటాడుతున్నాడు. నేలకేసి చూస్తూ, తలపంకిస్తూ మాటిమాటికీ 'యా–యా' అంటున్నాడు. ఇష్టంగా మాటాడుతూన్నట్టే మాటాడుతున్నాడు కానీ – సంభాషణ మరీ ఎక్కువగా కొనసాగించడం అతనికిష్టం లేదేమో అనిపిస్తోంది. కానీ ఆవిషయాన్ని అవతలి వ్యక్తికి తెలియకుండా తెలివిగా మేనేజ్ చేస్తున్నాడేమోనని కూడా అనిపిస్తోంది.



3. The Lover - ప్రేమికుడు

బహుశా అవతలి వ్యక్తి అతని భార్య కావచ్చు.

ఇక – మూడో బూత్‌లో ఉన్నతను (బొమ్మ 3) వెనక్కి తిరిగి గోప్యంగా మాటాడుతూన్నట్టుగా మాటాడుతున్నాడు. అతని ముఖం కానీ ముందుభాగం కానీ కనపట్టం లేదు. తల ఒక వైపుకి వంచి రిసీవర్ చెవి దగ్గిర పెట్టుకొని మాటాడుతున్నాడు. అతను ఫోన్‌ని సున్నితంగా పట్టుకొన్న తీరు చూస్తోంటే–ఆ ఫోన్‌నే తను మాటాడుతున్న వ్యక్తిగా భావించుకొని ఆనందపడిపోతున్నాడనిపిస్తోంది. మీరు గ్రహించే ఉంటారు – అతను తన గర్ల్‌ఫ్రెండ్‌తో మాటాడుతున్నాడని.

ఇంతవరకూ – నిజ జీవితంలో తారసపడే వ్యక్తుల్నీ, వాళ్ల శరీర కదలికలు చెప్పే విషయాల్నీ తెలుసుకొన్నాం. అంటే – మనం మనుషుల్ని చదవడం మొదలెట్టామన్నమాట !

# 3 హావభావాలు

ఇద్దరు సినీ తారల మధ్య Best Actress Award  కోసం పోటీ జరుగుతోంది. పోటీని తిలకించడానికి తండోపతండా లుగా వచ్చారు ప్రేక్షకులు. న్యాయ నిర్ణేతలు 'కష్టాల్లో ఉన్న స్త్రీ' ని పోటీ అంశంగా ఇచ్చి – ఇద్దర్నీ నటించి చూపెట్ట మన్నారు. మొదటి సినీతార అద్భుతమైన హావభావాలతో తన కిచ్చిన పాత్రని నటించి ప్రేక్షకుల్ని మంత్రముగ్ధుల్ని చేసింది. కన్నీరుమున్నీరుగా ఏడ్చిన ప్రేక్షకులు కరతాళ ధ్వనులతో ఆమెను మెచ్చుకొన్నారు. రెండో సినీతార సహజసిద్ధమైన హావ భావాల్ని ప్రదర్శిస్తూ ఆ పాత్రలో జీవించింది. కానీ ప్రేక్షకులు ఏడవటం కానీ, తప్పట్లు కొట్టడంకానీ చెయ్యలేదు!

న్యాయనిర్ణేతలు ఆమెనే Best Actress గా నిర్ణయిస్తూ – ఆమె నటన ప్రేక్షకుల్ని తన్మయత్వంలో ముంచిందనీ, అందుకే వాళ్లు అచేతనంగా ఉండిపోయారనీ తమ నిర్ణయాన్ని సమర్థించు కొన్నారు.

హావ భావాలు మనో భావాలకి అద్దం పడుతూంటాయి.

మాటలకందని భావాల్ని కళ్లు కనుబొమలు  పెదాలు తెలియచేస్తూంటాయి.

మనుషులు కళ్లతో రకరకాల భావాల్ని పరికిస్తూంటారు.

ఒకమ్మాయి ఒక అబ్బాయికేసి ఓరచూపులూ కోరచూపులూ చూస్తోందంటే – ఆమె అతనంటే మనసు పడుతోందన్నమాట.

ఒకబ్బాయి ఒక అమ్మాయికేసి దొంగచూపులు చూస్తున్నాడంటే – అతను

ఆమెపట్ల ఆకర్షితుడయ్యాడన్నమాట.

భార్య భర్తకేసి రుసురుసలాడుతూ చూస్తోందంటే – అతను ఆమెకి చెప్పిం దొకటి చేసింది మరొకటి అన్నమాట.

కూతురు తల్లికేసి అదోలా చూస్తోందంటే – ఆమెకి తల్లి చెప్పింది నమ్మబుద్ధి గావటం లేదన్నమాట.

ఇలా ఎన్నెన్నో భావాల్ని కళ్లు వ్యక్తపరుస్తుంటాయి.

భావ వ్యక్తీకరణలో కళ్లకి మల్లేనే కనుబొమలూ పాలు పంచుకొంటూ ఉంటాయి.

ఒక వ్యక్తి కనుబొమలు పైకి లేచాయంటే – అతను ఆశ్చర్యానందాల్లో మునిగి తేలుతున్నాడన్నమాట.

అతని కనుబొమలు ముడిపడ్డట్టుంటే – అతను దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడన్నమాట.

అతని కనుబొమల కొసలు కిందికి దిగితే – అతను కోపంతోగానీ అసంతృప్తితోగానీ వేగిపోతున్నాడన్నమాట.

ఇక పెదాలసంగతికొస్తే –భావ వ్యక్తీకరణలో అత్యంత ప్రాధాన్యత వహించేవి పెదవులు.

అందమైన పెదాల్ని చూసి మురిసిపోని మనుషులుండరు.

కవులయితే అద్భుతమైన వర్ణనలు చేస్తూ ఆటవెలదులూ సీసపద్యాలూ వ్రాస్తారు.

పెదాలతో ఆనందాన్ని, ఆశ్చర్యాన్నీ, అసంతృప్తినీ, కోపాన్నీ, బిడియాన్నీ తెలియచేయొచ్చు.

మనుషులు రకరకాలుగా నవ్వుతూ తమ ఆనందాన్ని వ్యక్త పరుస్తుంటారు.

మీరు బజారు కెళ్ళినప్పుడు పరిచయస్థులెదురైతే వారికేసి చూసి చిరునవ్వు

నవ్వుతారు. చిరునవ్వు పరిమితమైన ఆనందాన్ని తెలియచేస్తుంది. చిరునవ్వు (బొమ్మ 4a.) నవ్వేటప్పుడు పెదాలు విప్పారి ఉంటాయికానీ పళ్లు కనపడవు.




4a. Simple Smile - చిరునవ్వు



4b. Upper Smile - సగం నవ్వు

ఇక ఇంకోరకం నవ్వుంది. ఆనందాన్ని తెలియచేసే నవ్విది (బొమ్మ 4b) ఈ నవ్వు నవ్వినప్పుడు పెదాలు విప్పారి పై పలువరుస కనపడేటట్లుగా అందంగా విడివడతాయి. ఈ రకమయిన నవ్వుని మనం స్నేహితుల్నీ, ఆత్మీయుల్నీ పలకరించేటప్పుడు నవ్వుతాం.



4c. Broad Smile - నిండు నవ్వు

అన్నిటినీ మించిన నవ్వొకటుంది. నిండుగానవ్వే నవ్వది. (బొమ్మ 4c). ఈ నవ్వు నవ్వినప్పుడు విప్పారిన పెదాలు బాగా విడివడతాయి పలువరుసలు రెండూ కనపడేటట్లుగా. మరీ నవ్వు పుట్టించే విషయాన్ని విన్నప్పుడుగానీ, చూసినప్పుడుగానీ ఇలాంటి నవ్వు నవ్వుతాం. అరటి పండు తొక్కమీద కాలేసి జారిపడిన వ్యక్తిని చూసి అను కోకుండా నవ్వేనవ్వది.

ఈ మూడు సర్వసామాన్యంగా మనుషులు నవ్వే నవ్వులు.

ఇవికాక మనుషులు సందర్భాన్నిబట్టి ముసిముసి నవ్వులూ, మొలకనవ్వులూ, కొంటె నవ్వులూ నవ్వుతారు.

నవ్వు కేవలం ఆనందానికి మాత్రమే సంకేతం అనుకోడానికి వీల్లేదు.

కొంతమంది విషపునవ్వు నవ్వుతారు. దుర్మార్గపు ఆలోచనలు చేసే మనుషులు ఇటువంటి నవ్వు నవ్వుతారు.

మరికొంతమంది వంకర నవ్వు నవ్వుతారు. ఇలాంటి నవ్వు నవ్వేవాళ్ల బుద్ధి వంకరగా ఉంటుంది.

ఏడవలేక నవ్వే మనుషుల్ని కూడా మనం చూస్తుంటాం.

పెదాలు వ్యక్తపరిచే భావాలు మరికొన్ని ఉన్నాయి.

కోపం వచ్చినప్పుడు మనుషులు మూతి ముడుచుకొంటారు.

అసంతృప్తి కలిగినప్పుడు పెదాలు బిగపెడతారు.

ఆశ్చర్యం కలిగినప్పుడు నోరు వెళ్లబెడతారు.

మనుషులు తమ ముఖాల్లో ప్రదర్శించే అనేకానేక హావ భావాలు జగన్నాటకాన్ని రక్తి కట్టించడానికి ఎంతగానో తోడ్పడుతూంటాయి!

# 4 నడకతీరు

రాయలవారి కొలువుకి ఒకతనొచ్చి – రకరకాల భాషలు అనర్గళంగా మాటాడుతూ – తనెవరో తెలిస్తే చెప్పమని సభా సదులందర్నీ సవాలు చేశాడు. కొంతమంది అతను ఉత్తరాది వాడన్నారు. మరికొంత మంది దక్షిణాదివాడన్నారు. ఇంకొంత మంది కళింగ దేశస్థుడన్నారు. ఒకరిద్దరు అతను మహారాష్ట్రుడన్నారు. కానీ అతనెవరయిందీ ఎవరూ సరిగా చెప్పలేకపోయారు. రాయలవారు చిన్నబుచ్చుకొన్న మొహంతో ఇతనెవరో చెప్పగలిగే నాథుడే లేడా మన కొలువులో అన్నాడు. రామలింగడు లేచి "లేకేం ప్రభూ – నేనున్నాను" అన్నాట్ట. "అయితే చెప్పండి" అన్నారు రాయలవారు. రామలింగడు "ఇతను ఖచ్చితంగా తెలుగువాడే – నిన్న ఇతగాడు విజయ నగర పురవీధిలో అడ్డదిడ్డంగా నడుస్తుండగా చూశాను" అన్నాడు. ఆగంతకుడు తను తెలుగవాణ్ణేనని ఒప్పుకొన్నాడు.

మనుషులు రకరకాలుగా నడుస్తారు.

ఠీవిగా తలపైకెత్తి నడిచేవాళ్లు కొందరయితే – తలొంచుకొని

నేలచూపులు చూస్తూ నడిచేవాళ్లు మరికొంతమంది.

చేతులూపుకొంటూ చకచకా నడిచేవాళ్లు కొంతమందయితే – మదగజాలకి మల్లే మందయానాలు చేసేవాళ్లు మరికొంతమంది.


జేబుల్లో చేతులెట్టుకొని నడిచేవాళ్లు కొంతమందయితే – చేతులు వెనక్కి పెట్టుకొని నడిచేవాళ్లు మరికొంతమంది.

నడకని బట్టి మనిషిని గుర్తుపట్టవచ్చు.

నడిచే తీరునిబట్టి అతని మనస్తత్వాన్ని తెలుసుకోవచ్చు.

సంతోషంగా ఉన్న పిల్లాడు ఎగిరిగంతుతీసుకొంటూ నడుస్తాడు.

అలా కానప్పుడు నత్తగుల్లకిమల్లే మెల్లిగా నడుస్తాడు.




5. The dejected walker
నిరుత్సాహపు నడక

చేతులూపుకొంటూ చకచకా నడిచే మనుషులు జీవిత ధ్యేయాన్ని నిర్ణయించుకొని, దాన్ని సాధించడానికి నిరంతరం కృషిచేస్తూంటారు. నిరాశా నిస్పృహల్లో మునిగి పోయిన మనుషులు (బొమ్మ 5) తలొంచుకొని నేల చూపులు చూస్తూ చేబుల్లో చేతులు పెట్టుకొని నడుస్తారు. "ఎక్కడి కెళ్తున్నాం", "ఎలా వెళ్తున్నాం" అన్న ధ్యాసే లేకుండా జమిలిగా నడుచు కుంటూ పోతారు వీళ్లు.



6. The trust of energy walker ఉత్సాహపు నడక

ఇక – నడుంమీద చేతులానించి గబగబా నడిచే మనుషులు (బొమ్మ 6) జీవితంలో ఏవేవో సాధించెయ్యాలన్నీ అవీ ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా సాధించెయ్యాలని ఆతృత పడుతూంటారు. వీళ్లల్లో ఉన్న లోపం ఏమిటంటే – అనుకొన్నది సాధించే ప్రక్రియలో కొంతకాలం అత్యుత్సాహంతో పనిచెయ్యడం–ఆ తర్వాత చప్పగా చల్లారిపోవడం జరుగుతూంటుంది.



7. The preoccupied walker
ఆలోచనాభరితమైన నడక

మరో తరహా మనుషులుంటారు. ఏదైనా సమస్య వచ్చినప్పుడు ఆ సమస్యని గురించి అదేపనిగా అన్ని కోణాల్లోంచీ ఆలోచిస్తూంటారు. ఇలాంటి వాళ్లు చేతులు వెనక్కిపెట్టుకొని – తలొంచుకొని తాపీగా నడుస్తూంటారు. (బొమ్మ 7) మనదేశపు ప్రథమ ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ ఏదైనా సమస్య వచ్చినప్పుడు – ఈ విధంగానే నడిచేవారు.

కొందరు మనుషులు అన్నిటా తామే గొప్ప వాళ్లమనీ తమకి తిరుగేలేదనీ అనుకొంటుం టారు. ఇలాంటివాళ్లు గడ్డంపైకెత్తి – ఎవర్నీ పట్టించు కోనట్టుగా చూస్తూ – చేతులు ఒక ప్రత్యేకమైన తరహాలో ఊపుతూ దర్పం ఉట్టి పడేటట్టుగా నడు స్తారు. వీళ్ళు (బొమ్మ 8) ఇటలీ నియంత ముసోలినీ ఈ విధంగా నడిచేవాడు.

నడిచే నడక బట్టే మనకి గుర్తింపు వస్తుంది.

నాయకులందరూ విలక్షణమైన శైలిలోనే నడుస్తుంటారు.



8. The strutter
భేషజపు నడక

# 5 కరచాలనాలు

ఇద్దరు వ్యక్తులు కలుసుకొన్నప్పుడు చిరునవ్వులు చిందిస్తూ 'హలో!' అంటూ స్నేహసూచకంగా కరచాలనం చేస్తారు.

దీన్నే ఇంగ్లీషులో Shake hand అంటారు.

ఒకరిచేతిని మరొకరి చేతిలోకి తీసుకొని చేతులు కదిల్చి సున్నితంగా వదిలిపెట్టే ప్రక్రియ ఇది.

మన దేశస్థులు ఒకరినొకరు కలుసుకొన్నప్పుడు చిరునవ్వునవ్వుతూ 'నమష్కార్' అంటారు.

అన్ని విదేశీ అలవాట్లతోబాటు ఈ Shake hand కూడా దిగుమతి కావడంతో – మన దేశంలో ఈ అలవాటుకి విశేష ప్రాచుర్యం లభించి 'నమష్కార్' ని దాదాపుగా త్రోసిపుచ్చింది. కలెక్టరుగారు షేకేండిస్తే సామాన్యుడు మురిసిపోతాడు!

సినీ నటుడు షేకేండిస్తే అభిమాని తబ్బిబ్బయిపోతాడు!

కరచాలనాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిలో చేస్తారు.

కుడిచేతిలోకి అవతలి వ్యక్తి ఎడం చేతిని తీసుకొని సున్నితంగా కరచాలనం చేసి వదిలి పెట్టడం ఒక పద్ధతి.

కుడిచేతిలోకి అవతలి వ్యక్తి ఎడం చేతిని తీసుకొని గట్టిగా పట్టి ఉంచి కరచాలనం చెయ్యడం మరొక పద్ధతి.

కుడిచేత్తో అవతలి వ్యక్తి ఎడం చేతిని తీసుకొని గట్టిగా పట్టి ఉంచి ఎడంచేత్తో

ఆ రెండు చేతుల్నీ పట్టి ఉంచి కరచాలనం చెయ్యడం ఇంకో పద్ధతి.

కరచాలనం చేసే పద్ధతి ఒక్కొక్క దేశంలో ఒక్కొక్కరకంగా ఉంటుంది.

ఫ్రెంచి దేశస్థులు కలుసుకొన్నప్పుడు మళ్లీ విడిపోయేటప్పుడూ కరచాలనం చేస్తారు.

జెర్మన్స్ కలుసుకొన్నప్పుడు మాత్రమే కరచాలనం చేస్తారు.

ఆఫ్రికా దేశస్థులు కరచాలనం చేశాక వేళ్లు విరుచుకొంటారు.

కొన్ని దేశాలవాళ్లయితే ఈ అలవాటుని అసహ్యించుకొంటారు.

అందుకే విదేశాలకి వెళ్లినప్పుడు అక్కడివాళ్లు కరచాలనం చేసే పద్ధతుల్ని తెలుసుకొని ఎవరితోనయినా కరచాలనం చెయ్యడం ఉత్తమం.

కరచాలనం చేసే పద్ధతినిబట్టి మనుషుల మనస్తత్వాల్ని కనిపెట్టొచ్చు.

చెమట్లుపట్టే చేతులుంటే వాళ్లకి మానసిక ఆందోళనెక్కువగా ఉంటుంది.

కరచాలనం చేసే వ్యక్తి చెయ్యి మెత్తగా బలహీనంగా ఉంటే ఆ వ్యక్తి ఏదో అనారోగ్యంతోటి బాధపడుతున్నాడన్నమాట.

సినీ నటులూ, సంగీత కళాకారులూ, సర్జెన్సూ కరచాలనం చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొంటారు. ఎందుకంటే – వాళ్లకి చేతులు చాలా ముఖ్యమైనవి. ఎవరికి ఎటువంటి దుర్బుద్ధి ఉంటుందో ఎవరికి తెలుసు?

ఒకప్పటి ప్రఖ్యాత హిందీ సినీ నటుడు దేవానంద్‌ని ఎయిర్‌పోర్ట్‌లో ఒక అభిమాని కలుసుకొని – నానారకాలుగా అతణ్ణి పొగిడి – 'షేకేండిస్తారా?' అని అడిగాట్ట అతి వినయంగా. దేవానంద్ సరేనని షేకేండిచ్చాట్ట. ఆ అభిమాని థాంక్స్ చెప్పి వెళ్లిపోయాక – చెయ్యి చూసుకొంటే చేతిలో రక్తం కారుతోంది! అతను చేతిలో రేజర్ బ్లేడుపెట్టుకొని షేకేండిమ్మనమని కోరేడన్నమాట!


ఇలాంటి అభిమానులూ ఉంటారు!

చర్మరోగంతో ఉన్న వ్యక్తితో కరచాలనం చెయ్యడానికి మనం సహజంగానే వెనకాడతాం.

సేండోతోటి కరచాలనం చెయ్యడం కూడా అంత మంచిది కాదు.

ఎందుకంటే–అతని మీచేతుల్ని రెక్కలూడొస్తాయా అన్నంతగా వూపి వదలిపెడతాడు.


ఒకస్త్రీ బాధల్లో ఉన్న మరొక స్త్రీకి సానుభూతి తెలపాల్సి నప్పుడు–ఆమె చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొని జాలిగా చూస్తూ ఆ విషయాన్ని తెలియ చేస్తుంది (బొమ్మ 9)



9. Women expressing sympathy
**ఆడవాళ్లు సానుభూతిని తెలియచేసే పద్ధతి**

రాజకీయ నాయకులు కరచాలనం చేసే పద్ధతి మరో రకంగా ఉంటుంది. ఎలక్షన్ల టైమ్‌లో ఒక రాజ కీయ నాయకుడు మరొక రాజకీయ నాయకుణ్ణి కలుసుకొన్నప్పుడు – అతని ఎడం చేతిని తన కుడిచేత్తో పట్టుకొని, ఆ

రెండు చేతులమీదా తన ఎడం చేతిని ఉంచి, కరచాలనం చేస్తాడు (బొమ్మ 10). ఇలా చెయ్యడం ద్వారా అవతలివాడితో ఆత్మీయత పెంచుకోవచ్చని అతని ఉద్దేశం.



10. The politician's hands shake
**రాజకీయవేత్త కరచాలనం చేసే పద్ధతి**

# 6 స్వభావాలు

**ప**ట్నానికొచ్చిన రాఘవయ్య తాసిల్దారుగా పనిచేస్తున్న తన బాల్య మిత్రుడు శివయ్యని చూద్దామని వాళ్లింటికెళ్లాడు.

ఒకబ్బాయి ఇవతలికొచ్చి "ఎవరికోసం వచ్చావ్" అన్నాడు దూకుడుగా. రాఘవయ్య వచ్చిన పని చెప్పాడు. "ఆయనింట్లో లేరుగానీ – మళ్లీరా" అన్నాడు అంతే దూకుడుగా.

చిన్నబుచ్చుకొన్న మొహంతో రాఘవయ్య వెళ్లిపోబోతూంటే – ఇంకో అబ్బాయొచ్చి "ఎవరికోసం వచ్చారండీ?" అన్నాడు మర్యాదగా. రాఘవయ్య వచ్చినపని మళ్లీ చెప్పాడు. "ఇప్పుడే వచ్చేస్తారు. లోపలికొచ్చి కూర్చోండి" అన్నాడు వినయంగా. లోపలికెళ్తూ "నువ్వెవరు బాబూ" అనడిగాడు రాఘవయ్య. "నేనువారి పెద్దబ్బాయినండి. వీడు మా తమ్ముడండి" అన్నాడాబ్బాయి.

ఈలోగా శివయ్య రావడం మిత్రులిద్దరూ ఆనందంగా కుశల ప్రశ్నలేసుకోడం జరిగింది. భోజనాలు చేస్తున్నప్పుడు, శివయ్యని అడిగాడు రాఘవయ్య "ఏరా – ఇద్దరూ నీ కొడుకులేగదా – పెద్దతను మర్యాదగా మాటాడుతున్నాడు. చిన్నతను నిర్లక్ష్యంగా మాటాడుతున్నాడు. ఏమిటి సంగతి?"

"అందుక్కారణం ఉందిలే–నేను సాధారణ గుమస్తాగా ఉన్న ప్పుడు అందరితో వినయ విధేయతలతో మాటాడేవాణ్ణి. అప్పుడు పుట్టాడు పెద్దబ్బాయి. ఆ తర్వాత నేను తాసిల్దారునయ్యేక అందరి తోను ఎగిరిపోతున్నట్టు మాట్లాడ్డం అలవాటు చేసుకొన్నాను. అప్పుడు పుట్టాడు చిన్నబ్బాయి". అన్నాడు శివయ్య.

మనుష్యుల స్వభావాలు పెరిగే పరిసరాలబట్టీ పెంచే పెంపకంబట్టీ ఏర్పడుతూంటాయి.

ఒకరిది సర్దుకుపోయే స్వభావం అయితే మరొకరిది ఎదిరించే స్వభావం.

ఒకరిది ఉన్నదున్నట్టు మాటాడే స్వభావం అయితే మరొకరిది నంగిరి పింగిరిగా మాటాడే స్వభావం.

ఒకరిది కష్టపడి పనిచేసే స్వభావం అయితే మరొకరిది తిని కూచుని గడిపెయ్యాలనే స్వభావం.

ఒకరిది ఇతరుల్ని అర్థం చేసుకొనే స్వభావం అయితే మరొకరిది ప్రతీది అనుమానించే స్వభావం.

ఒకరిది దాతృత్వ స్వభావం అయితే మరొకరిది పిసినిగొట్టు స్వభావం. ఒకరది ఉపకారం చేసే స్వభావం అయితే మరొకరిది అపకారం చేసే స్వభావం.

ఇలా మానవ స్వభావాలు అనేకరకాలు.

ఒక్కొక్కశరీర భంగిమ ఒక్కొక్క స్వభావాన్ని తెలియచేస్తుంటుంది.



11. Open hands showing sincerity
నిష్కట స్వభావము

అరిచేతులు పైకుండేట్టుగా చేతులు ఎడంగాపెట్టి మాటాడుతూంటారు కొందరు (బొమ్మ 11). ఏ విషయం గురించయినా లేనిపోని అనుమానాలు పెట్టుకోకుండా, నిజాయితీగా వ్యవహరించడం వీళ్ల పద్ధతి. వ్యాపార సంబంధమైన విషయమైనా, మరే విషయమైనా, ఇలాంటి వ్యక్తులతో ఒక అంగీకారానికి రావడం సులభమైన విషయం.

అరిచేతులు పైకుండేట్టుగా చేతుల్ని ఎడంగా పెట్టి, భుజాల్ని మీదకీ, కిందకీ, కదుపుతూ మాటాడుతూం టారు మరికొంత మంది (బొమ్మ 12). ఎవరయినా ఏదైనా విషయం గురించి వీళ్లని తప్పు పట్టినప్పుడు 'నన్నేం చెయ్యమంటారండీ?' అన్న భావాన్ని వీళ్లీ విధంగా తెలియ చేస్తుంటారు.



12. What do you want me to do?
'నన్నేం చెయ్యమంటావయ్యా?'

అవతలి వ్యక్తిని పట్టించుకోనట్టుగా చూస్తూ, ఛాతీమీదుగా చేతుల్ని క్రాస్ చేసి నిలుచున్న వ్యక్తిని (బొమ్మ 13) అవతలి వ్యక్తి చెబుతున్నదాన్ని వినడు; ఒప్పుకోడు. క్రికెట్ మేచ్ మంచి రస గంధాయం లో ఉన్నప్పుడు – అంపైర్లు ఉన్నట్టుండి తప్పుడు నిర్ణ యాల్ని చేస్తూంటారు. అటు వంటి సందర్భాల్లో తిక్కెక్కి పోయిన ఆటగాళ్లు ఎంతగా ఎగురుతూ అభ్యంతరాల్ని తెలియచేసినా – అంపైర్ ఇప్పుడు చెప్పిన భంగిమలో నుంచుని – 'నా నిర్ణయాన్ని వెనక్కి తీసుకొనేది లేదు' అనే భావాన్ని ప్రదర్శిస్తూంటాడు.



13. The cross armed defencive position
తిరస్కార భంగిమ

అవతలి వ్యక్తిని ఏం పట్టనట్టుగా చూస్తూ – ఛాతీమీదుగా చేతుల్ని క్రాస్



14. Fists reinforcing the defensive position
**తిరస్కార భంగిమ**

చేసి–వేళ్లతో గట్టిగా భుజాల్ని పట్టుకొని నుంచున్న వ్యక్తి (బొమ్మ 14) తనకి నచ్చినట్టుగా ప్రవర్తిస్తాడు గానీ అవతలివాళ్లు చెప్పినదాన్ని ఖాతరు చెయ్యడు.

కొడుకుని తండ్రి 'ఈ తప్పు చేశావ్. ఆ తప్పు చేశావ్' అని అదేపనిగా తిడుతున్నప్పుడు కొడుకు ఈ విధంగానుంచుని 'తిడితే తిట్టావులే!' అన్నట్టుగా తండ్రికేసి చూస్తూ నుంచున్నాడనుకోండి.

అటువంటప్పుడు తండ్రి వెంటనే గ్రహించుకోవాలి.

ఇలా ఎంత తిట్టినా ప్రయోజనం లేదనీ –

కొడుకుని మరో విధంగా దారిలోకి తెచ్చుకోవాలనీ.



15. A woman's way wih the crossed arms gesture
**తిరస్కార భంగిమ**

కూతుళ్లు తప్పుగా నడుచుకొంటున్నప్పుడు తల్లులు క్లాసు తీసుకొంటారు. అటువంటప్పుడు కూతుళ్లు బుద్ధిగా వింటున్నట్టుగా చేతులు కట్టుకొని నుంచుని, ఏం పట్టనట్టుగా చూస్తున్నారంటే – తాము చెబుతున్నదానివల్ల ఏమాత్రమూ ప్రయోజనం ఉండబోదన్న సంగతిని తల్లులు గ్రహించాలి. (బొమ్మ 15)

ఆఫీసరు క్లార్కుని అదేపనిగా విమర్శిస్తున్నప్పుడు –క్లార్కు ఆఫీసరుకేసి నిస్సహాయంగా



16. The arm - gripping defensive position
తిరస్కార భంగిమ


చూస్తున్నట్టుగా కనిపించినా – వేళ్లతో భుజాల్ని బిగించి పట్టుకొని, చేతులు కట్టుకొని నిల్చున్నాడంటే – లోలోపల కుతకుత ఉడికి పోతున్నాడన్న విషయాన్ని ఆఫీసరు ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది (బొమ్మ 16)

ఇవన్నీ తిరస్కారాన్ని సూచించే భంగిమలు.

కుర్చీచేతిమీద కాలేసి–మరో కాలునేల మీదుంచి కుర్చీలో కూచునే వ్యక్తి (బొమ్మ 17). నిర్లక్ష్య స్వభావం కలిగి ఉంటాడు. ఎవరికీ, ఏ పనిలోనూ, ఏ విధంగానూ సహాయ పడడు.




17. Indifference or worse : a leg over arm of chair - నిర్లక్ష్యం



18. The European manners of crossing legs
యూరోపియన్లు కాలుమీద కాలేసుకొని కూర్చునే పద్ధతి


ఇక కాలుమీద కాలేసుకొని కూర్చునే వ్యక్తులుంటారు (బొమ్మ 18). యూరో పియన్లు కాలుమీద కాలేసు కొని దర్జాగా కూచుంటే –



19. The American four figure position
**అమెరికన్లు కాలుమీద కాలేసుకొని కూర్చునే పద్ధతి**

అమెరికన్లు ఒకకాలిమీద ఎత్తిపెట్టిన మరో కాలేసుకొని - (బొమ్మ 19) నాలుగంకెని గుర్తు చేస్తూ కూర్చుంటారు. వీళ్లకి పోటీ పడే మనస్తత్వం ఎక్కువగా ఉంటుంది. అవతలి వాళ్లు చెప్పిన దానికి ఒప్పుకోరు.

ఆడవాళ్లు కాలుమీద కాలేసుకొని కూర్చుని - పైకాలిని అదే పనిగా ఊపుతున్నారంటే - వాళ్లకి విసుగ్గాగానీ చికాకుగాగానీ ఉందన్న విషయ గ్రహించుకోవాలి. (బొమ్మ 20)




20. Boredom or impatience - **బోర్‌డమ్ / అసహనం**

కొంతమందికి అవతలి వాళ్లమీద జులుం చేసే మనస్తత్వం ఉంటుంది. అలాంటివాళ్లు కుర్చీకి అడ్డంగా ఇటూ అటూ కాళ్లేసుకొని కూర్చుంటారు (బొమ్మ 21). ఆర్మీ ఆఫీసర్లు కిందవాళ్లకి హుకుం జారీచేసేటప్పుడు - తల కొద్దిగా పైకెత్తి, తీక్షణ వీక్షణాల్ని ప్రసరిస్తూ, చేతులు వెనక్కి పెట్టుకొని హుకుం జారీచేస్తూంటారు. (బొమ్మ 22).




21. Stradding a chair, another dominancing have
**అధికార కాంక్ష**



22. Authority : the reargeant
**అధికారం**

ఇక – మనం చెప్పింది నచ్చనప్పుడు అవతలి వ్యక్తి మనకేసి పక్క చూపులు చూస్తోంటాడు (బొమ్మ 23). 'నువ్వు నాగురించి ఏమనుకొంటున్నావ్?"



23. What do you mean
**ఏమిటి నీ ఉద్దేశం?**

అన్న భావాన్ని తెలియచేస్తూంటాయి ఆ చూపులు. ఈ రకం చూపులు అనుమానాన్నీ అపనమ్మకాన్నీ తిరస్కారాన్నీ కూడా సూచిస్తూంటాయి.

కొంతమంది మనుషులున్నారు! మనం ఏదైనా విష యాన్ని గురించి వాళ్ల అభిప్రాయాన్ని అడిగామను కోండి. నోరు కనపడీ కనపడ కుండా చెయ్యి అడ్డుపెట్టి చూపుడువేలిని ముక్కు మీదకి పోనిచ్చి మాటాడుతూంటారు వీళ్లు! నిజాన్ని దాచిపెట్టి మాట్లాడాలనుకొనే మను ష్యులు వీళ్లు (బొమ్మ 24).




24. Touching the nose - దాపరికం

'పెర్ల్‌బక్ గురించి మీ అభిప్రాయం ఏమిటి?' అని ఇటువంటి వ్యక్తిని అడిగారనుకోండి. అతను పెర్ల్‌బక్ గురించి విని ఉండకపోవచ్చు. ఆమె రచనల్ని చదివి ఉండకపోవచ్చు. కానీ ఆ నిజాన్ని దాచిపెట్టి 'పెర్ల్‌బక్ చాలా మంచి రచయిత. అతని రచలన్నీ నేను చదివాను' అని చెబుతాడు నోటికి చెయ్యి అడ్డంగా ఉంచి చూపుడువేలిని ముక్కుమీదకి పోనిస్తూ. 'అంటే–మీరేం చదవలేదన్న మాట' అని కుండబద్దలు కొట్టినట్టుగా మీరన్నారనుకోండి. 'సారీ –నేనేం చదవలేదు' అని ఉన్న విషయాన్ని ఒప్పుకొంటాడు.



25. Well ! I don't know
అపనమ్మకం

ఇలాంటి మనుషులే చేతివేలితో చెవిగోక్కుంటూనో (బొమ్మ25), కళ్లనులుముకుంటూనో (బొమ్మ 26) మాటాడుతూంటారు. వీళ్లూ దాపరికం మనుష్యులే! అవతలి



26. I can't see it - అపనమ్మకం

వాళ్లు చెబుతున్న దాన్ని గురించిన అపనమ్మకం వీళ్లమనస్సుల్లో ఉంటుంది. కానీ ఆ విషయాన్ని బయటపెట్టకుండా ఈ విధమైన ఆంగిక ప్రదర్శన చేస్తూంటారు.

# 7 అంచనాలు

ఒకరోజు కొద్దిగా చెముడున్న కుఱ్ఱాడు స్కూలు నుంచి వచ్చి వాళ్ల టీచరిచ్చిన చీటిని వాళ్లమ్మకిచ్చాట్ట. ఆ చీటీలో 'మీ టామీది మరీ మంద బుద్ధి. చదువుకి పనికిరాడు. స్కూలుకి పంపించడం మానుకొంటే మంచిది.' అని ఉంది. వాళ్లమ్మ టీచర్‌కి జవాబు వ్రాసి పంపించింది. 'మా టామీ మీరనుకొంటు న్నట్టుగా మందబుద్ధికాడు. వాడికి నేనే చదువు చెప్పు కొంటాను.' ఆ టామీయే విశ్వవిఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్‌గా ఎదిగాడు ! ఎడిసన్ విషయంలో వాళ్లమ్మ అంచనా కరెక్టయింది ! టీచర్ అంచనా తప్పయింది!

స్కూల్లో చేర్చుకొనే ముందు విద్యార్థి తెలివితేటల్ని అంచనా వేస్తాడు ప్రిన్సిపాల్.

ఉద్యోగానికి ఎంపిక చేసేముందు 'అభ్యర్థి ప్రతిభాపాటవాల్ని' అంచనా వేస్తాడు ఆఫీసర్.

సరుకు కొనుగోలు చేసేముందు లాభనష్టాల గురించి అంచనా వేస్తాడు వ్యాపారస్తుడు.

ఒక వ్యక్తి గురించిగానీ, ఒక విషయం గురించిగానీ, అంచనా వేసే వ్యక్తుల శరీర భంగిమలెలా ఉంటాయో తెలుసుకొందాం.

మాస్టారు పాఠం చెబుతూంటే ఒకబ్బాయి స్ట్రెయిట్‌గా కూర్చుని కన్నార్పకుండా మాస్టారికేసే చూస్తూ పాఠం వింటున్నాడనుకోండి. అనుభవంలేని మాస్టారవుతే 'ఆహా! ఎంతబాగా వింటున్నాడు!' అనుకొంటాడు. ఆ కుఱ్ఱాడు

పాఠం వింటున్నట్టు నటిస్తున్నాడన్న విషయం తెలుసుకోడు!'

అదే అనుభవజ్ఞుడయిన మాస్టారవుతే ఇట్టే కనిపెట్టేస్తాడు ఆ విషయాన్ని.

అదే క్లాసులో మరొకబ్బాయి బెంచీ అంచుమీద కూచొని, ముందుకొంగి తల కొద్దిగా పక్కకి వాల్చి గెడ్డం కింద చెయ్యి ఉంచి, మాస్టారికేసూ చూస్తూ వింటున్నాడనుకోండి – అతను శ్రద్ధగా వింటున్న విద్యార్థి అన్నమాట.

ఆగస్ట్‌రోడిన్ 'ఆలోచిస్తున్న మనిషి' అనే అద్భుతమైన శిల్పం చెక్కాడు.



27. Evaluation gesture -ఆలోచన

చెంపమీద చెయ్యి ఆనించి, ముందు కొంగి, ఏదో విషయం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్న మనిషి శిల్పం అది. రోడిన్ శిల్పానికి మల్లే ముందు కొంగి కూచుని, చెంపమీద చెయ్యి ఆనించి, ఏదో విషయం గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నట్టుగా ఒక వ్యక్తి కనపడ్డా డనుకోండి – మీకనుమానమే అఖ్కర్లేదు. అతను దేన్ని గురించో తీవ్రంగా ఆలోచిస్తున్నాడు (బొమ్మ 27). ఏ వ్యక్తి గురించో ఏ విషయం గురించో అంచనా వేస్తున్నాడన్నమాట.

ఇంకో వ్యక్తిని చూద్దాం.

కుర్చీమీద – ఒక చేతిని కుర్చీచేతిమీద ఆనించి, మరో చేత్తో కుర్చీ ఇంకో చేతిని పట్టుకొని, ఒక పక్కకివాలి, గెడ్డం చేతిమీద ఆనించి – కూచున్నాడు. చేతి చూపుడు వేలు చెంపమీద ఆని ఉంది. మిగిలిన వేళ్లు మూతికిందకి ముడుచుకొని ఉన్నాయి. (బొమ్మ 28). ఇటువంటి వ్యక్తిని మీరు సహాయం ఆశించి కలుసుకొన్నారనుకోండి. అతను మీరు చెప్పింది శ్రద్ధగా వింటాడు. పైన వివరించిన భంగిమలో కూచుని మీ గురించీ మీరు చెప్పిన విషయాన్ని

గురించి నిశితంగా ఆలోచిస్తాడు. కొనసకి – మీకు సహాయం చెయ్య కపోతేనే మంచిదన్న నిర్ణయాని కొస్తాడు. కనుక ఈ భంగిమలో కూచుని ఆలోచించే వ్యక్తులు మీకు సహాయం చేస్తారని ఆశించ కండి.

ఇక–ఇంకో తరహావ్యక్తి ఉన్నాడు. ఇతను ప్రతీ విషయాన్నీ మరో కోణం నుంచి ఆలోచించడానికి ప్రయత్నిస్తూంటాడు.



28. A critical evaluation - దీర్ఘాలోచన



29. The chin stroking evaluation
'అతను చెప్పిందాంట్లోనూ పాయింటుంది'

గెడ్డంమీద చేతినానించి, చూపుడు వేలితో గెడ్డాన్ని తాటిస్తూ – అవతలి వ్యక్తికేసి భావ యుక్తంగా చూస్తూం టాడు. (బొమ్మ 29) అవతలి వ్యక్తి చెప్పిందాన్ని కూడా పరిగణన లోకి తీసుకొందాం – అన్నదే ఆ భంగిమకి అర్థం. ఏ విషయం గురించయినా అన్ని కోణాల్లోంచీ అలోచించి సరైన నిర్ణయం తీసుకొనే మనుషులు వీళ్లు.

ఈ వ్యక్తిని చూశారా? ముక్కు చివర ఆనించిన కళ్లద్దాల్లోంచి అవతలి వ్యక్తి కేసి నిశితంగా చూస్తున్నాడు. (బొమ్మ 30).



30. What was that again - 'మళ్ళీ ఏం జరిగింది?'

ఆ చూపులు చూస్తోంటే అవతలి వ్యక్తి ఇబ్బందిగా ఫీలవుతాడు. ఆ చూపుల్లో 'ఈ మాత్రపు పని చెయ్యడం కూడా నీకు తెలియదన్నమాట!' అన్న విమర్శ ఉంది. 'మళ్ళీ తప్పు చేశావన్నమాట!' అన్న అవహేళనుంది. ఈ విధంగా ముక్కు చివర ఆనించిన కళ్ళద్దాల్లోంచి అవతలి వాళ్ళకేసి చూసే వాళ్లు మంచివాళ్లే కావచ్చు. కానీ వాళ్ల చూపులు తరచుగా అపార్థాలకి దారి తీస్తూంటాయి. ముక్కు చివర ఆనే కళ్లజోడుకి బదులుగా మామూలుగా రెండు కళ్ళకి మధ్యగా ముక్కుమీద ఆనే కళ్ళజోడు పెట్టుకొంటే వీళ్ళకి అపార్థాల బెడద తప్పుతుంది.

ఇక మరో వ్యక్తి ఉన్నాడు. ఇతగాడికి ఏదైనా విషయం గురించి ఆలోచించ టానికి టైమ్ కావాలి. ఆ విషయం ఇవతలికి చెప్పలేదు. అందుకని కళ్ల జోడు తీసి కళ్లజోడు కాడని నోటికి తగిలిస్తూ ఆలోచిస్తూంటాడు (బొమ్మ 31). ఏ విషయం గురించయినా



31. Gaining time to evaluate - టైమ్ తీసుకునే పద్ధతి

వెంటనే తన అభిప్రాయాన్ని తెలియ చెయ్యకుండా కళ్లజోడుతో ఇలాంటి భంగిమలు ప్రదర్శిస్తూంటాడు.

ఈ వ్యక్తిని చూడండి. ముక్కుమీద చేతివేళ్లానించి కళ్లు మూసుకొని ఆలోచిస్తూంటాడు (బొమ్మ 32). ఇతను చాలా సెన్సిటివ్. ఏ విషయం



32. It is hard for me to see the answer - ఏం చెయ్యాలి చెప్మా?

గురించయినా తొందరపడి ఒక నిర్ణయానికి రాకూడదన్నదే ఇతని తపన. ఈ సమస్యకి పరిష్కారం ఎలా లభిస్తుంది చెప్మా అని ఇతన మదన పడుతూంటాడు. ఇలాంటి వ్యక్తిని కలుసుకొన్నప్పుడు 'ఏమిటను కొంటు న్నారు?' 'ఈ విషయంలో మీ నిర్ణయం ఏమిటి? అని అదే పనిగా అడు గుతూ విసిగించకండి. అతను ఏదో ఒకటి చెప్పేదాకా ఓపిక వహించండి. అతను తెలియచేసిన సందేహాల్ని నివృత్తి చెయ్యడానికి ప్రయత్నించండి. అప్పుడే మీ కార్యం సానుకూల పడటానికి అవకాశం లభిస్తుంది.

# 8 భావావేశాలు

బజార్లో మిత్రుణ్ణి కలిశాడు ఆశ్చర్యానంద.

"ఈ మధ్య వైజాగ్ కెళ్లాను" అన్నాడు మిత్రుడు.

"ఏవిటీ!! వైజాగ్‌కే !!!"

"అంతాశ్చర్యపోవటానికేముంది? మళ్లీ కుదర్దుకదా అని బీచ్ కెళ్లాను"

"అబ్బా!!! బీచి కెళ్లావన్నమాట !!! బీచంతా చూసేశావన్నమాట !!!"

"అదేదో అద్భుతమైన విషయమన్నట్టు మాటాడుతావేమిటి? బీచ్‌లో సబ్‌మెరీన్ చూశాను."

"ఏవిటి !!! సబ్ మెరీన్!!! సబ్‌మెరీన్ని చూసేశావన్నమాట !!! నీదయ్యా అదృష్టం అంటే!!!"

"ఏం అదృష్టం లెద్దూ – సబ్‌మెరీన్నుంచి కిందకి దిగుతూంటే కాలుజారి కిందపడ్డాను. ఫ్రాక్చరవ్వటంతో కింగ్‌జార్జి హాస్పిటల్‌కి వెళ్లాల్సి వచ్చింది."

"ఏవిటీ!!! కె.జి.హెచ్‌కే!!! ఆంధ్రా అంతటికీ అతి పెద్ద హాస్పటలు!!!"

"అబబ్బా!!! ప్రతిదానికీ ఆశ్చర్యమేనయ్యా నీకు! వస్తామరి "


అంటూ వడివడిగా నడుచుకొంటూ వెళ్లిపోయాడు మిత్రుడు.

ఆవేశాలపుట్ట మనిషి.

సందర్భానుసారంగా ఆశ్చర్యం, ఆనందం, కోపం, నిస్పృహ వంటి అనేకరకాలైన భావావేశాల్ని ప్రదర్శిస్తూంటాడు.

కండకావరంతో విఱ్ఱవీగే కుఱ్ఱాళ్లు కయ్యానికి కాలు దువ్వుతూంటారు.

‘రారా–ముందుకురారా –నీ రక్తం కళ్ల చూస్తా–’ అని ఒకడంటే ‘నువ్వే ముందుకు రారా – నీ ప్రాణాలు తీస్తా –’ అని మరొక డంటాడు. ఆ సమయంలో వాళ్లు కాళ్ళు ఎడంగా పెట్టి నడుంమీద చేతు లిటూ అటూ పెట్టి నుంచుంటారు (బొమ్మ 33).



33. Hands on hips, a typical readiness gesture
బస్తీమే సవాల్ !

ఈ విధంగా నుంచునే వాళ్లందరూ కయ్యా నికి కాలుదువ్వే వాళ్లని అనుకోవడం పొర పాటు. ఇలా నుంచునే వాళ్ళూ, కుర్చీమీద – ముందుకొంగి, ఎడంగా పెట్టిన కాళ్ల మీద చేతులానించి కూర్చునేవాళ్లూ, జీవితంలో ఒక ధ్యేయాన్ని పెట్టుకొని ఆ ధ్యేయాన్ని సాధించడానికి నిత్యం కృషి చేస్తూంటారు. వీళ్లు తమ ధ్యేయసాధన కోసం, అవతలి వాళ్లతో రాజీ పడటానికి కానీ, సహకరించడానికి గానీ లేదా విభేదించడానికీగానీ, తప్పుకోడానికికానీ సిద్ధంగా ఉంటారు. వీళ్లు కార్యసాధకులు.

ఇక మరోరకం మనుషులున్నారు. వీళ్లు తమ ఆత్మగౌరవం దెబ్బతింటోందను కొన్నప్పుడు ఆవేశంతో ఊగిపోతూంటారు. అవతలి వాళ్లతో వాళ్లెంతటి వాళ్లయినా సరే – అమీతుమీ తేల్చుకోవాలనుకొంటారు. ఇలా చెయ్యాలను కోవడమే తడవు – తమ పైఅధికారుల గదిలోకెళ్లి వాళ్లతో గొడవపెట్టు కొంటారు. టేబులుమీద చేతులానించి – ముందుకొంగి నిల్చుని, పై అధి కారుల మొహాల్లోకి సూటిగా చూస్తూ, ‘మీరు నన్ను డిస్మిస్ చెయ్యాలను కొంటున్నారు కదూ?” మీకా అవసరం రానీకుండా నేనే రాజీనామా చేస్తు న్నాను–’ అని ఆవేశంగా చెబుతారు దీన్నే ఇంగ్లీషులో ‘షో డౌన్’ అంటారు. (బొమ్మ 34).



34. The showdown - **అమీ తుమీ**

అధికారులూ అనుభవజ్ఞులూ, వివేకవంతులూ అయితే తొందరపడరు.

అతని ప్రవర్తనకి మూలకారణం తెలుసుకొని, అతనికోపం సహేతుకమైందే అయితే –అతణ్ణి శాంతింపచేసి అతనికి తగిన న్యాయం చేస్తారు. అలా కానప్పుడు అతని మీద క్రమశిక్షణ చర్య తీసుకోడానికి వెనుకాడరు.

నిస్పృహ మనుష్యుల్ని తీవ్రంగా కృంగదీస్తుంది.

వరస పరాజయాలతో కుమిలిపోతున్న క్రీడాకారుడు – తలకి పెట్టుకొన్న టోపీ తీసి గిరవాటేసి, చేతివేళ్లని జుట్టుమీదకి పోనిచ్చి తల గోక్కుం టూనో, కాళ్లతో నేలని తన్నుతూనో, తన నిస్పృహని తెలియచేస్తాడు. (బొమ్మ 35).



35. Frustration - **నిస్పృహ**

వ్యాపారంలో నష్టాలమీద నష్టా లొస్తుంటే – వ్యాపారస్తుడు చేతిలో ఉన్న పెన్నుగానీ, పెన్సిల్‌గానీ, విసిరేసో – విరగ్గొట్టేసో – తన నిస్పృహని తెలియచేస్తాడు.



36. The hand wringing gesture
ఆందోళన

భగ్నజీవులు నిట్టూర్పులు విడుస్తూ తమ నిస్పృహని తెలియచేస్తారు.

మనుషుల్ని కృంగదీసే మరొక విషయం మానసిక ఆందోళన.

మనుషులు తాము పడుతూన్న ఆందోళన కళ్లతోనూ, చేతుల్ని ఒకదానితో మరొక దాన్ని రాపాడించడం ద్వారానూ తెలియచేస్తారు. (బొమ్మ 36)

కొంతమంది తాము పడుతున్న ఆందోళన బయటపడకుండా ఉండడానికి ప్రయత్నిస్తూంటారు. వ్యాపార చర్చల్లో పాల్గొనే వ్యక్తులు ఈ కోవలోకి వస్తారు. పైకి ప్రశాంతంగా ఉన్నట్టుగా కనపడుతూన్నప్పటికీ, చేతుల్లో ముఖం పెట్టుకొని కూర్చోవడం ద్వారా–వీళ్లు అనుకోకుండానే తమ మానసికాందోళనని తెలియ చేస్తూనే ఉంటారు (బొమ్మ 37).



37. Tightly clenched hands
ఆందోళన

మరికొంతమంది గోళ్లుకొరుక్కోవడం ద్వారా తాము పడుతున్న ఆందోళనని తెలియచేస్తూంటారు. ఇటువంటివాళ్లకి ఆత్మవిశ్వాసం తక్కువగా ఉంటుంది. వీళ్ల భుజం తట్టి, ధైర్యం చెప్పగలిగేవాళ్లుంటే చాలు–వీళ్లు తలపెట్టిన కార్యాల్లో విజయాన్ని సాధిస్తారు.

ఇక – అనుకోని విషయాల్ని విన్నప్పుడుగానీ, చూసినప్పుడుగానీ, మనుషులు తమ సంభ్రమాశ్చర్యాలని కళ్లు పెద్దవి చేసుకొని చూస్తూ, నోటిమీద చేతులేసుకోవడం ద్వారా తెలియచేస్తూంటారు (బొమ్మ 38).



38. Astonishment - ఆశ్చర్యం

భావావేశాల్ని తెలియచేసే భంగిమల్ని గురించి తెలుసుకొన్నాం కదా - మరికొంచెం ముందుకెళ్దామా?

# 9 మానసిక ప్రవృత్తులు

నెమ్మదిగా పెరిగే మొక్కలాంటిది ఆత్మవిశ్వాసం –

నిరంతర కృషి ఆత్మవిశ్వాసాన్ని అలవరుస్తుంది –

ఆత్మవిశ్వాసంగల వ్యక్తి నిటారుగా నిల్చుంటాడు. నిటారుగా కూర్చుంటాడు.

అందుకే కాబోలు – పెద్దవాళ్లు పిల్లల్ని 'సరిగా కూచో–' 'సరిగ్గా నుంచో' అని హెచ్చరిస్తూ ఉంటారు.

ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి మాట ధీమాగా ఉంటుంది; ఎదుటి వ్యక్తికి నమ్మకం కలిగించేదిగా ఉంటుంది.

అతనేపని చేసినా క్షుణ్ణంగా లోపరహితంగా చేస్తాడు.


తలపెట్టిన కార్యాన్ని, ఎన్ని ఆటంకాలొచ్చినా, విజయవంతంగా పూర్తి చేసేదాకా వదలిపెట్టడు.

అందుకే అతను ఇతరుల్ని సులభంగా ప్రభావితం చేస్తాడు; తను చెప్పినట్టుగా నడుచుకొనేట్టు చేస్తాడు.

అతను మాటాడే పద్ధతి ప్రత్యేకంగా ఉంటుంది –

పైకెత్తిన చేతుల్ని దగ్గరికి చేర్చి, అవి గోపురాకృతిలో ఉండేట్టుగా

వేళ్ల కొసల్ని ఒకదానితో మరొకదాన్ని కలుపుతూ, మాటాడుతూంటాడు (బొమ్మ 39).



39. steepling gesture
ఆత్మవిశ్వాసం

రాజకీయ నాయకులు, న్యాయవాదులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు ఈ విధంగా మాటాడుతూండటం మనం గమనిస్తూనే ఉంటాం.

ఆత్మవిశ్వాసంగల స్త్రీలు చేతులు కొద్దిగా పైకెత్తి, వాటిని గోపురాకృతిలో అమర్చి మాటాడుతూంటారు.

ఆత్మవిశ్వాసంగల వాళ్లు ఈ విధమైన భంగిమలోనే మాటాడతారని కాదు – కానీ – ఇదొక ముఖ్యమైన భంగిమ.

మనుషుల్లో స్వార్థం సహజంగానే గూడుకట్టుకొని ఉంటుంది.

మనుషుల్లోనేకాదు. జంతువుల్లో కూడా స్వార్థం ఉంటుంది.

అందుకే ఒక పేటలో నివసించే కుక్కలు ఒక కొత్త కుక్క తమ ప్రాంతంలోకి ప్రవేశించడానికి ఒప్పుకోవు. అన్నీ ఒక్కసారిగా కొత్త కుక్కమీదకి దండయాత్ర చేస్తాయి.

మనుషులు ఇందుకు భిన్నంగా ప్రవర్తించరు.

కిక్కిరిసిన రైల్వే కంపార్ట్‌మెంట్లో ప్రయాణం చేస్తున్న వాళ్లు కొత్త ప్రయాణీకులు తమ కంపార్ట్‌మెంట్లోకి ఎక్కడానికి ఒప్పుకోరు.


స్వార్థం మనుషుల్ని ఒక స్థలం మీదగానీ, వస్తువుమీదగానీ, వ్యక్తిమీదగానీ హక్కులు పొందడం కోసం ప్రయత్నించేలా చేస్తుంది. ఆ హక్కులు పొందడంలో వాళ్లు ఒక రకమయిన ఆనందాన్ని పొందుతారు.

సినిమాహాలుకి వెళ్ళినప్పుడుగానీ రైళ్లలో ప్రయాణం చేసేటప్పుడుగానీ మనం మంచి సీట్లలో జేబురుమాళ్లు పరిచిగానీ, న్యూస్‌పేపర్లు పరచిగానీ, వాటిని సొంతం చేసుకొన్నట్టుగా ఫీలవుతాం. ఎవరైనా వాటిలో కూచోడానికి ప్రయత్నిస్తే ససేమీరా మనం ఒప్పుకోం.

భార్యాభర్తలిద్దరూ పార్టీకి వచ్చినప్పుడు – తన భార్యకేసి ఎవరైనా చూసినంత మాత్రాన – ఆమె మీద తనకున్న హక్కుని అవతలతను కాలరాసేస్తున్నట్టు

భర్త ఫీలవుతాడు. తన భార్యని అవతలి వ్యక్తి దుష్టవీక్షణం నుంచి తప్పించ డానికి తెగ తాపత్రయ పడతాడు.

పాత ఫ్యామిలీఫొటో ఆల్బమ్ చూస్తోంటే –ఒక వ్యక్తి కారుమీద షోగ్గా చెయ్యేసి చిరునవ్వు నవ్వుతూ నిలబడి ఉన్న ఫొటో కనిపిస్తుంది. ఆ కారు తనదైనందుకు అతను పొందిన ఆనందం అంతా అతని భంగిమలో కనిపిస్తూనే ఉంటుంది .



40. Pride and possession - కలిగి ఉన్నాననే గర్వం


ఆల్బమ్ తిరగేస్తూంటే మరొక ఫొటో కనిపిస్తుంది. మీ దగ్గరి బంధువతను ఫారిన్ వెళ్లి బాగా డబ్బు గడించుకొని వచ్చాడు. మస్తుగా ఆస్తులు అమర్చు కొన్నాడు. తన ఔన్నత్యం అణు వణువుగా కనిపించే విధంగా–ఖరీదయిన సోఫాలో – జేరగిలబడి –నెత్తికి వెనకాల రెండు చేతులూ పెట్టుకొని–కాలుమీద కాలేసు కొని–దర్జాగా కూచున్నాడు (బొమ్మ 41).



41. Superiority - భేషజం


అతను కూర్చుని ఉన్న తీరు – అతని ఔన్నత్య భావాన్ని అన్ని విధాలా తెలియ చేస్తోంది. దీన్నే ఇంగ్లీషులో Superiority Complex అంటారు.

సమస్యలులేని మనిషుండడు. సమస్య లెదురైనప్పుడు కొంతమంది కంగారెత్తిపోతారు. మరి కొంతమంది లోలోపల ఆందోళన పడుతున్నా గుంభనంగా ఉండడానికి ప్రయత్నిస్తారు. ఇటువంటి వ్యక్తులు తలొంచుకొని చేతులు వెనక్కి పెట్టుకొని నడుస్తూంటారు. పిడికిలి బిగించిన చేతిని మరోచేత్తో గట్టిగా పట్టుకొని ఉంటారు (బొమ్మ 7). ఇలా గుంభనంగా ఉండడానికి చేసే ప్రయత్నాన్ని ఆత్మనిగ్రహం, ఇంగ్లీషులో Self Control అంటారు. వీళ్లు లోలోపల పడే ఆందోళనని పిడికిలి బిగించిన చేతులు తెలియచేస్తూ ఉంటాయి.



7. The preoccupied walker
**ఆలోచనా భరితమైన నడక**

మరికొందరున్నారు. వీళ్లు పైకి ప్రశాంతంగా కనపడ్డానికి ప్రయత్నిస్తున్నప్పటికీ లోలోపల పడుతున్న భయాందోళనలని బిగించిన పిడికిళ్ళ ద్వారా తెలియచేస్తూనే ఉంటారు. ఇటువంటి వ్యక్తులు కుర్చీలో కూర్చున్నప్పుడు – కుర్చీ చేతుల్ని చేతుల్తో బిగబట్టి – ఎడంగా పెట్టిన కాళ్లని పాదాల దగ్గర కొచ్చేటప్పటికి ఒకదానితో మరొకటి మడతపెట్టి –కూచుంటారు (బొమ్మ 42).



42. Locked ankles and clenched fists -
**మానసిక ఆందోళన**

వీళ్ల శరీర కదలికలు చెప్పకనే చెబుతూంటాయి – వీళ్లు పడుతున్న భయాందోళనలని.

# 10 వీటి గురించి తెలుసుకోండి

ఉపన్యాస కేసరి జనాల్ని బాదుతున్నాడు తన ఉపన్యాసంతో.

జనాలు ఆ బాధని భరించలేక, ఒక్కొక్కరూ జారుకొంటున్నారు.

ఒకే ఒకతను ఓపిగ్గా కూచుని, ఉపన్యాసం చివరికంటూ విన్నాడు.

ఉపన్యాసకేసరి వేదిక దిగివచ్చి, ఆ వ్యక్తిని అభినందిస్తూ అన్నాడు :

"మీరొక్కరే నా ఉపన్యాసాన్ని అత్యంత ఓపికతో విన్నారు! మీకు నా ధన్యవాదాలు!"

"మీ తర్వాత మాట్లాడాల్సిన వక్తని నేనేనండి." అని అతను జబాబిచ్చాడు.

ప్రేక్షకుల్ని బోరుకొడుతున్నామేమోనన్న స్పృహేలేకుండా, గంటల తరబడి ఉపన్యాసాలిచ్చే వాళ్లకి ఇలాంటి చేదు అనుభవాలు ఎదురవుతూనే ఉంటాయి.

బోరుగా సాగిపోతున్న ఉపన్యాసాన్ని వినే ఓపికలేని ప్రేక్షకులు రకరకాలుగా తమ అసహనాన్ని ప్రదర్శిస్తూంటారు.

కొంతమంది బల్లలమీద దరువేస్తూ ఉంటారు.

మరికొంతమంది కాళ్లతో నేలని తడుతూ చప్పుళ్ళు చేస్తూ ఉంటారు.


బాల్ పాయింట్‌పెన్ అదే పనిగా క్లిక్ చేస్తూ తమ విసుగుదలని ప్రదర్శించే వాళ్లు కొందరయితే – పిల్లికూతల్తో కుక్క అరుపుల్తో బాహాటంగానే గొడవ చేసేవాళ్లు మరికొంతమంది.

ఆ మాటకొస్తే ఉపన్యాస కర్తలు కూడా ఒకప్పుడు మరొకరి ఉపన్యాసాలు

వింటున్నప్పుడు ఈ విధంగా ప్రవర్తించిన వాళ్లే అయ్యుంటారు.

మనస్తత్వ శాస్త్రజ్ఞులు చెప్పినదాని ప్రకారంగా

గర్భంలో భద్రంగా ఉండే శిశువు, తల్లి గుండె చప్పుడు వింటూ ఆనందాన్ని పొందుతూంటుంది. పుట్టుక తరువాత కూడా ఆట వస్తువులు చేసే చప్పుళ్లతో ఆనందాన్ని పొందుతూంటారు పిల్లలు. పెరిగి పెద్దయ్యాక కూడా మనుషులు అసహనంతో ఉన్నప్పుడు గానీ, ఆతృతతో ఉన్నప్పుడుగానీ, రకరకాల చప్పుళ్లు చేస్తూనో, వింటూనో, ఆనందాన్ని పొందటానికి ప్రయత్ని స్తూంటారు.



43. Boredom
బోర్‌డమ్ విసుగుదల

విసుగేసిన మనిషి కొద్దిగా వెనక్కి వాలి కూచుని, చేతిని చెంపకా నించి, గెడ్డం కిందకిదించి, కను రెప్పలు కిందకి వాల్చి, విసిగిస్తున్న మనిషికేసి చూస్తూ, తన విసుగు దలని ప్రదర్శిస్తాడు (బొమ్మ 43). 'ఎప్పుడొొదుల్తుందిరా బాబూ ఈ బోరు?' అన్న భావాన్ని బాహాటం గానే ప్రదర్శిస్తుందీ భంగిమ. అలాంటి పరిస్థితొచ్చినప్పుడు అవతలి వ్యక్తి జాగ్రత్త పడడం మంచిది.

కొంతమంది బోరుకొడుతున్న వ్యక్తికేసి భావరహితంగా చూస్తూంటారు. 'నీకేసి చూస్తున్నానుకానీ – నువ్వు చెప్పింది వింటంలేదు' అన్నదే ఆ చూపుకి అర్థం. ఆ విషయాన్ని అవతలి వ్యక్తి ఎంత త్వరగా తెలుసుకొంటే అంత మంచి దతనికి.

విసుగుదలని తెలియచేసే భంగిమల గురించి తెలుసుకొన్నాం గదా –

మరికొన్ని విషయాల గురించి తెలుసుకొందాం.

ఈ కాలంలో లంచం ఇవ్వందే ఏ పనీ జరగదన్న విషయం అందరికీ తెలిసిందే గదా–

లంచాన్నే ఫార్మాలిటీ (formalities) అనీ, మామూలు అనీ, చెయ్యి తడపడం అనీ అంటూంటారు.

లంచాన్ని ఒక్కొక్కరు ఒక్కొక్క పద్ధతిలో పడుతూంటారు.

కొంతమంది చేతికి మట్టికాకుండా పడితే, మరికొంతమంది బాహాటంగానే పడతారు.

లంచాలు తినటానికి అలవాటుపడిన అధికారి, నేరుగా కాకుండా, తనకి విశ్వాసపాత్రుడయిన క్లార్కు ద్వారా లంచాన్ని తీసుకొంటాడు. క్లార్కు చెప్పిన తర్వాతే కాగితాల మీద సంతకం పెడతాడు. బాగానే డబ్బు ముడుతుందని క్లార్కు చెప్పడంతో కాంట్రాక్టు కాగితాల మీద approved అని వ్రాసి సంతకం పెడతాడు. ఆ తర్వాత ముట్టాల్సిన డబ్బు పూర్తిగా ముట్టలేదని తెలుసు కోవడంతో, approved అనే పదం ముందు not అనే పదం చేర్చి not approved గా మారుస్తాడు. అంటే కాంట్రాక్టుని రద్దు చేశాడన్నమాట!లబ దిబోమంటూ మొత్తుకుంటూ వచ్చిన కాంట్రాక్టరు పూర్తి డబ్బుని ముట్టి చెప్పడంతో, not అనే పదానికి 'e' చేరుస్తాడు. Note approved గా మార్చి కాంట్రాక్టుని ఆ కంట్రాక్టరుకే ఇస్తాడన్నమాట!

పనిమీద ఆఫీసుకెళ్లిన వ్యక్తి ఆ పనికి సంబంధించిన క్లార్కుని కలిసి – ఎవరూ లేకుండా ఉన్నప్పుడు చూసి – 'మీ ఫార్మాలిటీస్ అబ్జర్వ్ చేస్తాను' అనో 'మీకివ్వాల్సింది ఇస్తాను'అనో నమ్మకంగా చెప్పాడనుకోండి.

అతని పనికి సంబంధించిన కాగితాలు చకచకా ముందుకు కదుల్తాయి ! ఎటొచ్చీ – పని పూర్తయ్యాక, క్లార్కు చేతులు నులుపుకొంటూ, పని చేయించుకొన్న వ్యక్తికేసి చూస్తుంటాడు (బొమ్మ 44).




44. Hand rubbing, gesture of expectation - చేతులు నులుముకొనే భంగిమ

అంటే అతని చేతులు తడపాల్సిన సమయం ఆసన్నమయిందన్నమాట!

మరో తరహా మనుషుల గురించి చెబుతాను.

మీరు కార్యార్థి అయి ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తిని కలుసుకొన్నారుకోండి.


మీపని సానుకూలపడేదీ – లేందీ – ఆ వ్యక్తి కుర్చీలో కూర్చున్న తరహాబట్టి చెప్పొచ్చు. అతను కుర్చీలో రెండు చేతుల మీదా చేతులానించి, కోటు బొత్తాలు పెట్టుకోకుండా ఫ్రీగా ఉండేలా వేసుకొని, కాళ్లు ఎడంగా పెట్టి, కూచుని, మీకేసి చూస్తూ మాట్లాడుతున్నాడనుకోండి (బొమ్మ 45). మీపని సానుకూలపడ్డట్టే. అతన కూచున్న పద్ధతి లింకనెస్క్ పొజిషన్ అంటారు. అబ్రహాం లింకన్, అమెరికన్ ప్రెసిడెంటే. ఆ విధంగా కూచుని తనని కలుసుకోటానికి వచ్చిన వ్యక్తితో మాట్లాడేవాట్ట. రాగద్వేషాలకి అతీతంగా మనుషులతో వ్యవహరించిన వ్యక్తి అబ్రహాం లింకన్ !



45. Lincolnesque position
ముక్కుకి సూటిగా పోయే మనస్తత్వం

ఇంకొన్ని తరహాల వ్యక్తుల గురించి చెబుతాను. కొనేవాళ్లు (Buyers) అమ్మేవాళ్ళు (Sellers) ఈ తరహాల్లోకి వస్తారు. ఇద్దరిదీ వ్యాపార దృక్పథమే. అయితే వీళ్లు మాటాడే పద్ధతీ కూర్చునే తీరూ వేరువేరుగా ఉంటాయి.

కొనే అతను కుర్చీలో జేరబడి, చేతులు పైకెత్తి గోపురాకృతిలో వాటిని దగ్గరికి చేర్చి, కోటుబొత్తాలు పెట్టుకొని, కాలుమీద కాలు కాలేసుకొని, పైక వేసిన కాలుని ఊపుతూ, అమ్మే అతనికేసి అధికారికంగా చూస్తూ, దర్జాగా కూర్చుంటాడు. అమ్మే అతను కుర్చీలో ముందుకొంగి కూచుని – కాళ్లు ఎడంగా ఉంచి, చేతులు కొద్దిగా దగ్గరికి చేర్చి, కొనే ఆయనకేసి సిన్సియర్‌గా చూస్తూ, తన పాడక్ట్స్ ప్రత్యేకతల గురించి, వాటిని కొనడం వల్ల వచ్చే లాభాల గురించీ ఓపిగ్గా వివరిస్తూ అవతలి వ్యక్తిని ఒప్పించడానికి ప్రయత్నిస్తాడు. అతను కోటు బొత్తాలు పెట్టుకోకుండా ఫ్రీగా ఉండేట్టుగా వేసుకొంటాడు (బొమ్మ 46). అమ్మే అతను చెప్పేవాటిని కొనే అతను



46. Buyer and seller - **కొనేవాడు - అమ్మేవాడు**

ఒక పట్టాన నమ్మడు. అతని మనసులో అనేక రకాల అనుమానాలు దోబూచులాడుతూంటాయి. అమ్మే అతను అనుభవజ్ఞుడయితే ఆ పద్ధతిలోనే ఒప్పించి చెప్పి అతణ్ణి మెప్పించి, ఆర్డర్ బుక్ చేస్తాడు. అనుభవంలేని వాడిపని హరీ ! హరీ!

# 11 ప్రేమాయణం

రాణి మోహన్‌ని ప్రేమించింది.

మోహన్ రేఖని ప్రేమించాడు.

రాణి రేఖని చంపింది.

మోహన్ స్మితని పెళ్లి చేసుకొన్నాడు.

రాణి నిద్రమాత్రలు మింగి చనిపోయింది.

తన మూలంగా రాణి రేఖలు చనిపోయినందుకు బాధతో తాగుడికి బానిసయి అసువులు బాసాడు.

భర్తపోయాక తను మాత్రం బతికి ఏం లాభం అనుకొని స్మిత ఉరేసుకొని చనిపోయింది.

ఇది సగటు సినీమా ప్రేమకథలా కనిపించొచ్చు గానీ –

ఇలాంటివి జరగటానికి క్కూడా అవకాశం లేకపోలేదు.

కాకపోతే – అన్ని ప్రేమకథలూ ఈ విధంగానే పరిసమాప్తమౌతాయను కోడానికి వీల్లేదు.

పరిస్థితులు కలిసొచ్చినప్పుడు సుఖాంతమైన ప్రేమకథలూ ఎన్నో ఉంటాయి.

పదహారేళ్ల ప్రాయంలో అమ్మాయిలూ అబ్బాయిలూ తరుచుగా ప్రేమలో పడుతూంటారు.

'చిగురాకులలో చిలకమ్మా – చిన్న మాట వినవమ్మా – ' అని అబ్బాయి

ప్రాథేయపడితే –

'కనులు మూసినా – నీవాయే – నే కనులు తెరిచినా – నీవాయే – ' అని అమ్మాయి కలవరిస్తుంది.

ప్రేమికుల బాడీ లేంగ్వేజ్ ఎలా ఉంటుందో తెలుసుకొందామా!

అమ్మాయిలయితే – తమ చూపులతోనే మనో భావాల్ని తెలియచేస్తూంటారు. అమ్మాయిలకి సహజంగా సిగ్గు ఎక్కువగా ఉండడమే అందుక్కారణం.

అమ్మాయి తను ప్రేమిస్తోన్న అబ్బాయి ఎదురుపడినప్పుడు, తలుపుచాటున దాగి ఓర చూపులు చూస్తోందంటే – దగ్గర కొచ్చి పలకరించమని సైగ చేస్తోందన్నమాట !

అబ్బాయి చొరవచేసి తను ప్రేమిస్తోన్న అమ్మాయిని దగ్గరికి తీసుకోబోతే – ఆ అమ్మాయి తప్పించుకొని పోయి అతనికేసి జాలిగా చూసిందనుకోండి – ఆ అమ్మాయి ఆ అబ్బాయిని ప్రేమిస్తున్నట్టుగా చెబుతోందన్నమాట !

అలాకాకుండా – కనుబొమలు చిట్లించి కోరచూపులు చూసిందనుకోండి – తనతోటే ఉంటానని బాస చెయ్యమని అడుగుతోందన్నమాట !

అమ్మాయి కేవలం చూపులతోనే కాకుండా, అందంగా తయారవ్వడం ద్వారా, తను మనసుపడినవాడు దగ్గరగా ఉన్నప్పుడు, మాటిమాటికీ – జుట్టు సరిచేసుకోవడం, బట్టలు సవరించుకోవడం ద్వారా, తన ప్రేమ సంకేతాల్ని పంపిస్తూంటుంది.

అబ్బాయిల సంగతికొస్తే –

వాళ్లకి చొరవ ఎక్కువగా ఉంటుంది.

నీట్‌గా డ్రెస్ చేసుకొని, స్టైలిష్‌గా తయారయి, తమ మనసుకి నచ్చిన అమ్మాయిల వెంట బడుతూంటారు. వాళ్లతో మాటాడటానికి ప్రయత్నిస్తూంటారు. వాళ్లకి దగ్గరవడానికి తెగ తాపత్రయ పడుతూంటారు.

అబ్బాయి తను ప్రేమిస్తున్న అమ్మాయి పక్కనే కూర్చున్నప్పుడు ఏనుగెక్కినంత సంబరర పడిపోతూంటాడు.

తలపైకెత్తి ఆమెకేసే ప్రేమగా చూస్తూంటాడు.

మాటి మాటికీ క్రాఫింగ్ సరిచేసుకొంటూంటాడు.

అప్పుడప్పుడు నెక్‌టై సరిచేసుకొంటూంటాడు.

సూట్లో ఉంటే – కోటు దగ్గరికి తీసుకొని బటన్స్ పెట్టుకొంటూ ఉంటాడు.

కిందకి జారిపోతున్నట్టుగా ఉన్న బూట్ సాక్స్‌ని పైకి లాక్కుంటూ ఉంటారు.

మొత్తానికి ఆమె కూర్చున్నంత ఈజీగా కూర్చోలేడు !

ఇక వారిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగిందనుకోండి.

ఒకరి నొకరు దగ్గరికి తీసుకోవడం ద్వారా, ఒకరిమీద ఒకరు చేతులు వేసుకోవడం ద్వారా, ఒకరికేసి ఒకరు ఆరాధనగా చూపులు చూడడం ద్వారా తమ ప్రేమని తెలియ చేసుకొంటారు. (బొమ్మ 47)



47. చెలిచెంత

అబ్బాయి తన వెంట పడడం, తనతో మాట్లాడ్డానికి ప్రయత్నించడం అమ్మాయికి ఇష్టం లేదనుకోండి.

అతనికేసి చురచూరాచూస్తూ, చేతులు కట్టుకొని, కాళ్లు క్రాస్‌చేసి నుంచుంటుంది. అలా నుంచుందంటే, 'నువ్వంటే నాకిష్టం లేదు. నీ వేషాలు

కట్టిపెట్టు’ అని చెబుతోందన్నమాట!

(బొమ్మ 48)

అమ్మాయికీ అబ్బాయికీ మధ్య ప్రేమాయణం సాగుతూన్నంతసేపూ – వాళ్లకి బోలెడంత ఎక్సైట్‌మెంటే ! వాళ్ల పెద్దలకి చెప్పలేనంత తలనొప్పి!



48. నీ వేషాలు కట్టిపెట్టు

# 12 అఫీషియల్ డమ్

కొత్తగా డ్యూటీలో చేరిన ఆఫీసర్‌ని క్లార్కు ఉబ్బులింగడు, ఇంద్రుడు చంద్రుడు అంటూ పొగుడుతున్నాడు.

ఆఫీసరు సీరియస్‌గా మొహంపెట్టి "నీ గురించి డ్యూటీలో జాయినవక ముందే విన్నాను. వచ్చిన ప్రతి ఆఫీసర్‌నీ నీ అంతటివాడు లేడని పొగిడి నీక్కావలసిన పని చేయించుకొంటావుట. నాకు పొగడ్తలు కిట్టవు. నేను చాలా స్ట్రిక్ట్ ఆఫీసర్ని" అన్నాడు చీదరింపుగా.

ఉబ్బులింగడు ఏమాత్రం నిరుత్సాహపడకుండా "అదేకదండీ మీతో వచ్చిన వెధవ గొడవ. అందరికీ పొగడ్తలు కిడతాయిగానీ మీకు మాత్రంకిట్టవు" అన్నాడు.

ఆఫీసరు ఉబ్బిపోయి "ఏం కావాలో చెప్పు" అన్నాడు.

ఒక ప్రభుత్వశాఖలో -

ఆఫీసర్, ఆఫీసర్ కింద మేనేజర్, మేనేజర్ కింద హెడ్‌క్లార్క్, హెడ్‌క్లార్క్ కింద క్లార్క్స్, వాళ్ల కింద ప్యూన్స్ ఉంటారు. దీన్నే హయరార్కీ అంటారు. హయరార్కీ అంటే వివిధ స్థాయిలలో పనిచేసే అధికారిక వ్యవస్థ అని చెప్పుకోవచ్చు. ఈ అధికారిక వ్యవస్థ పనిచేసే తీరునే అఫీషియల్‌డమ్ అంటారు.

పై అధికారికి కింది ఉద్యోగుల మీద అధికారం చెలాయిస్తూంటాడు.

'ఈ పని చెయ్యండి' 'ఆ పని చెయ్యండి' అంటూ ఆజ్ఞలు జారీ చేస్తూంటాడు.

పని సరిగ్గా చెయ్యకపోతే డిసిప్లినరీ ఏక్షన్ తీసుకొంటానని బెదిరిస్తూ ఉంటాడు.

కింది ఉద్యోగస్థుల్లో కొంతమంది ఆఫీసరు ఇష్ట ఇష్టాల్ని తెలుసుకొని తదనుగుణంగా నడుచుకొంటూంటారు.

మరికొంతమంది తల బిరుసుగా వ్యవహరించి కష్టాల్లోకి ఇరుక్కుంటూంటారు.

ఇంకొకమంది ఆఫీసర్‌కి తైరుకొడుతూ అతనికిష్టుడుగా అవటానికి ప్రయత్నిస్తుంటారు.

వీళ్లకీ బాడీ లేంగ్వేజుంది.

వీళ్ల మనోభావాల్ని ఎక్కువగా ముఖభంగిమలే తెలియచేస్తూంటాయి.

పై అధికారి కింది ఉద్యోగికేసి కనుబొమ్మలు పైకెత్తి చూస్తున్నాడంటే అతనికా ఉద్యోగి పట్ల చాలా కోపంగా ఉందన్నమాట.

కింది ఉద్యోగి చెప్పిందానికి పై అధికారి తల అడ్డంగా ఊపుతున్నాడంటే అతనిపట్ల చాలా అసంతృప్తిగా ఉన్నాడన్నమాట.

పైఅధికారి కింది ఉద్యోగికేసి అనుమానంగా చూస్తున్నాడంటే – అతనా ఉద్యోగి చెప్పిందాన్ని నమ్మటం లేదన్నమాట.

కింది ఉద్యోగి ఏదో చెబుతూంటే పై అధికారి అతనికేసి చూడకుండా అఫీషియల్ పేపర్స్ చదువుతూ కూచున్నాడంటే – అతనింకా తన రూమ్‌లో ఉండడం అధికారికి ఇష్టం లేదన్నమాట.

కింది ఉద్యోగి ఏదో విన్నవించుకొంటూంటే పై అధికారి రిస్ట్‌వాచ్‌కేసి చూస్తున్నాడంటే, అతను చెప్పింది వినటానికి తనకి టైంలేదని చెబుతున్నాడన్నమాట.

కింది ఉద్యోగి తెలివైన వాడయితే పైఅధికారి మనోగతాన్ని తెలుసుకొని ఆయన దగ్గిర శలవు తీసుకొని అవతలికి వెళ్లిపోతాడు.

అలాకాక ఇంకా మాటాడుతూ ఉంటే అధికారి సీట్లోంచి లేచి 'మీకు పనుం దనుకొంటాను – వెళ్లి మీ పని చూసుకోండి" అని కటువుగా చెబుతాడు. ఆ పరిస్థితి వచ్చినప్పుడు కింది ఉద్యోగి తలదించుకొని, 'సారీ సార్' అని చెప్పి, మనసులో తనని తానే తిట్టుకొంటూ అవతలికి వెళ్ళిపోతాడు.

ఇక కింద ఉద్యోగి తనకేదో సమస్య వచ్చినప్పుడు ఆ సమస్య గురించి వివరించి సహాయం చెయ్యమని కోరదామని పైఅధికారి దగ్గరికి వెళ్లాడను కోండి.



48. సమస్యల భారం

పైఅధికారి తలొంచుకొని, కనురెప్పలు దించు కొని, చేతులు కట్టుకొని, కాళ్లు ఒకదానిమీద మరొకటి వేసుకొని, దేన్ని గురించో ఆలోచిస్తున్న భంగిమలో కూచుని ఉన్నాడనుకోండి (బొమ్మ 48)

వెంటనే కింది ఉద్యోగి గ్రహించుకోవాలి తన పైఅధికారి ఏదో సమస్య గురించి ఆలోచిస్తూ సతమతమౌతున్నాడనీ.

ఆ సమయంలో అతని దగ్గరికెళ్లి తన సమస్య గురించి ప్రస్తావించడం అంత బుద్ధితక్కువ పని ఇంకొకటుండదనీ.

ఒకవేళ పైఅధికారి తనని చూసి పలకరించినా – తనకున్న సమస్య గురించి కాకుండా మరొక విషయం గురించి సున్నితంగా మాట్లాడి వచ్చేయాలి.

పై అధికారి కోటు జేబులో చెయ్యిపెట్టుకొని హుందాగా నిలబడి ఉన్నాడంటే అది అతని అధికారాన్నీ ఆత్మవిశ్వాసాన్నీ తెలియచేస్తుంది.


కింది ఉద్యోగి ఉద్యోగంలో చేరినప్పుడు, పదోన్నతి పొందినప్పుడు, అను భవంతో తలపండిపోయినప్పుడు ఎలా ప్రవర్తిస్తాడో అతని బాడీ ల్యాంగ్వేజ్

ఎలా ఉంటుందో మొదటి అధ్యాయంలో(శరీరం మాటాడుతుంది)లో చెప్పడం జరిగింది.

పైఅధికారి కింది ఉద్యోగిని అదేపనిగా విమర్శిస్తున్నప్పుడు, క్రింది ఉద్యోగి నిస్సహాయంగా చేతులు కట్టుకుని నిలుచున్నా, అతని వేళ్లు భుజాల్ని గట్టిగా పట్టి ఉంచిన తీరుచూస్తే తెలుస్తుంది. అతను లోలోపల కోపంతో కుతకుత ఉడికి పోతున్నాడనీ, ఏ క్షణంలోనయినా ఎదరు తిరుగుతాడని. అటువంటి సమయాల్లో అధికారులు జాగ్రత్త వహించాలి.

కింది ఉద్యోగస్థులందరూ ఒకే విధంగా ఉండరు.

కొంతమందికి ఆవేశం పాలు ఎక్కువ వుంటుంది. తమకి అవమానం జరిగిందని భావించినప్పుడు అధికారుల రూములోకి దూసుకువెళ్ళిపోయి ముందుకొంగి రెండు చేతులూ జేబులు మీద ఎడంగా పెట్టి అధికారులతో ఆవేశంగా మాట్లాడేవాళ్లుంటారు. అలాంటి ఆవేశపరులు నిజాయితీ పరులని తెలిసినపుడు అధికారులు అతనికి జరిగిన అన్యాయాన్ని సరిదిద్ద డానికి ప్రయత్నించాలి.




49 A. బొమ్మ

ఒక్కొక్కప్పుడు కింద ఉద్యోగి తన వల్ల తప్పుండి కూడా తలబిరుసుగా వ్యవహరించడం జరుగుతూంటుంది. అలాంటప్పుడు పై అధికారికి అతనిమీద చర్య తీసుకోవడం తప్పిస్తే మరో గత్యంతరం ఉండదు. 49వ బొమ్మలో A లో అధికారి క్రింది ఉద్యోగితో, "నీతో మాట్లాడాలి. నువ్వొకసారి నా రూముకి రా–" అంటున్నాడు.


అలా అంటున్నప్పుడు అతను తీక్షణంగా చూస్తూండ డాన్నీ, పైకెత్తిన

అతని చేతిని చూస్తూ, కింది ఉద్యోగి గ్రహిస్తాడు. తను చేసిన తప్పు ఆఫీసరుకి తెలిసిపోయిందనీ, తనని వాయించడానికే రూముకి పిలుస్తు న్నాడనీ.



49 B. బొమ్మ

49 B లో అధికారి ఉద్యోగిని అతను చేసిన తప్పుకి అతణ్ణి తీవ్రమైన పదజాలం తో విమర్శిస్తూ, చెయ్యి పైకెత్తి చూపుడు వేలుతో అతనిమీద తీసుకోబోయే చర్య గురించి హెచ్చరిస్తు న్నాడు. ఉద్యోగి నడుం మీద ఇటూ అటూ చేతు లేసుకొని నుంచుని అధి కారితో దెబ్బలాడ్డానికి సిద్ధంగా ఉన్నాడు.



49 C. బొమ్మ

49C లో ఉద్యోగి ముందు కొంగి చేతులు అధికారి టేబుల్ మీద ఆన్చి అధికారి కేసి తీవ్రంగా చూస్తూ తను చేసిన తప్పేమిటని అధికారి మీదకి ఎదురు దాడికి దిగాడు. అధికారి ఎత్తిన చేతిని టేబులు మీదుంచి, వెనక్కి వంగి, ఉద్యోగికేసి నిర్విణ్ణు డయి చూస్తున్నాడు.

49D లో ఉద్యోగి మామూలు పొజిషన్‌కి వచ్చాడు. కానీ ఛాతీమీద కొచ్చేట్టుగా చేతులు కట్టుకు నుంచుని అధికారికేసి గుబ్బుగా చూస్తున్నాడు.



49 D. బొమ్మ

అధికారి రెండు చేతులూ టేబులు మీద ఆన్చి కుర్చీలో నిటారుగా కూర్చుని ఉన్నాడు. కళ్ళజోడు తీసి టేబుల్‌మీదుంచాడు.

ఉద్యోగికేసి కోపంగా చూస్తూ మౌనంగా ఉన్నాడు.

అంటే పరిస్థితి విషమించిందన్నమాట ! ఉద్యోగిని డిస్మిస్ చెయ్యాలన్న నిర్ణయాన్ని తీసుకొన్నాడన్నమాట !

బాడీ ల్యాంగ్వేజ్ తెలిసున్న ఉద్యోగస్తులు ఇతర మనోగతాన్ని అవగతం చేసు కొంటూ, అందుకు తగ్గట్టుగా వ్యహరిస్తూ, సమర్థులని పేరు తెచ్చుకొంటారు. పదోన్నతులు త్వరగా త్వరగా పొందుతూంటారు.

తెలియనివాళ్ళు ఇతరుల మనోగతాన్ని అర్థం చేసుకోకుండా తమకి తోచినట్టు ప్రవర్తిస్తూ చిక్కులు కొనితెచ్చుకొంటారు.

ఉద్యోగంలో ఎదుగూ బొదుగూ లేకుండా ఎక్కడున్నావే గొంగళీ అంటే అక్కడే ఉన్నానే అన్నట్టుగా ఉండిపోతారు.

# 13 ఫంక్షన్లో మనుషులు

ఒక ప్రముఖ సినీతార మరో ప్రముఖ సినీ తారని ఫంక్షన్లో కలిసినప్పుడు అంది :

“చిత్రలోకం పత్రికలో నువ్వు పాఠకుల ప్రశ్నలకిస్తున్న జవాబులు బావున్నాయి. ఎవళ్లచేత రాయిస్తున్నావోగాని.”

అవతలావిడ అంది : “నీ అభిప్రాయం చెప్పినందుకు థాంక్స్! ఎవళ్లచేత చదివించుకొన్నావోగాని.”

మీరేదైనా ఫంక్షన్‌కి వెళ్లినప్పుడు, వివిధ రకాలైన వ్యక్తుల్ని కలుసుకోడానికి అవకాశం లభిస్తుంది. ఆ అవకాశాన్ని బాడీ ల్యాంగ్వేజ్‌కి సంబంధించిన మీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోడానికి ఉపయోగించుకోండి.


వాళ్ల హావ భావాల బట్టీ, శరీర కదలికల్ని బట్టీ, వాళ్ల మనోగతాల్ని తెలుసుకోడానికి ప్రయత్నించండి. ఈ ఫంక్షన్‌హాల్‌ని చూడండి.

బృందాలుగా విడిపోయి మాటాడుకొంటున్నారు అతిథులు.

కొందరు నిల్చుని ఉన్నారు. కొందరు కూర్చుని ఉన్నారు.

ఇటుకేసి ఉన్న వాళ్లని చూశారా?

కుడిచేతివైపు సోఫోలో ఇద్దరు ఇడవాళ్లు కూర్చున్నారు. వాళ్లకి కొద్ది దూరంలో ఇద్దరు మగాళ్లు నిల్చుని మాటాడుకొంటున్నారు. వాళ్లకి కొద్ది దూరంలో ఎడంవైపుగా ఒకతను కొద్దిగా ముందుకొంగి కుర్చీలో కూర్చున్నామెతో మాట్లాడుతున్నాడు (బొమ్మ 50)



50. 'ఐ లవ్ యూ'  'ఎన్నాళ్లకి కలుసుకొన్నాం'  'నీకో సంగతి చెప్పానా?'

మధ్యన నుంచున్న మగాళ్లు నవ్వుకొంటూ మాటాడుకొంటున్నారు.

ఇద్దరూ కోట్లకి బటన్స్ పెట్టుకోకుండా ఫ్రీగా వదిలేశారు. అంతే – వాళ్లిద్దరూ ఒకరిపట్ల మరొకరు స్నేహపూర్వకంగా ఉన్నారన్నమాట. ఒకతను ఒకచేతిని ఫ్రీగా పక్కకి వదిలి, మరో చేతిలో బొటన వేలిని బెల్టువెనక వైపుకి పెట్టి, మిగిలిన వేళ్లని ఇవతలికి వదలిపెట్టాడు. కాళ్లు ఎడంగా పెట్టి నుంచున్నాడు.

ఈ రకమైన భంగిమ – అతనికి తనమీద తనుకున్న నమ్మకాన్ని తెలియ చేస్తోంది.

మరొకతను చేతుల్ని ఫ్రీగాపక్కకి వదలిపెట్టి, కాళ్లెడంగా ఉంచి నుంచున్నాడు.

అతని భంగిమ అతని సహృదయతని తెలియచేస్తోంది –

కుడిచేతివైపు కూర్చున్న ఆడవాళ్లు వీళ్లిద్దరికేసే చూస్తున్నారు.


వాళ్లిద్దరూ ఒకొళ్లకొకళ్లు అనుకొని కూర్చుని ఉన్నారు. ఒకామె మరోకామెతో ఏదో రహస్యమైన విషయం గురించి చెబుతోంది. ఆమె చెబుతున్న విషయం ఆ మగాళ్లిద్దరి గురించిందే కావచ్చు.

ఇద్దరూ కాలిమీద కాలేసుకొని కూర్చున్నారు. కొద్దిగా ముడిచిన చేతుల్ని ఒళ్లో దగ్గిరగా పెట్టుకొని కూచున్నారు. ఇంకొకళ్లని తమ విషయాల్లో జోక్యం

చేసుకోడానికి ఒప్పుకోని మనస్తత్వం అన్నమాట వాళ్లది ! వాళ్ళు మాటాడు కొంటున్న తీరు వాళ్లిద్దరూ ఒకరికొకరు బాగా పరిచయస్థులనీ, ఇద్దరి అభిరుచులూ చాలా మటుకు ఒకటిగానే ఉంటాయన్న విషయం కూడా తెలుస్తోంది.

ఇక – ఎడం చేతివైపు కూచున్న యువతి ఎదురుగా నుంచుని ఉన్న యువకుడితో మాటాడుతోంది. కుర్చీమీద కొద్దిగా ముందుకు వంగి కూర్చుని, కాళ్లు ఎడంగా పెట్టి, ఫ్రీగా వదిలిన చేతుల్ని మోకాళ్లమీదుంచి, అతనికేసి ఇష్టంగా చూస్తూ, చిరునవ్వు చిందిస్తూ మాటాడుతూండటాన్ని చూస్తే – మనకి సులభంగానే బోధపడుతుంది – ఆమె అతనితో మాట్లాడ్డా నికి చాలా ఉత్సాహపడుతోందని – అతను ముందుకొంగి, మాటిమాటికీ నెకటైని సరిచేసుకొంటూ, నవ్వుతూ ఆమెతో మాట్లాడుతూండటాన్ని చూస్తే – మనకర్థమైపోతుంది అతను ఆమె అంటే తెగ ఇష్టపడుతున్నాడని.

ఇక – అటుకేసి ఉన్నవాళ్లని చూశారా? (బొమ్మ 51).



51. బోర్‌డమ్/విసుగుదల తిరస్కారం ఆత్మీయత

మధ్యన – ఒక యువకుడు ఒక పెద్దాయన ఉన్నారు. అతను చెప్పింది నచ్చక కోపమో – పెద్దాయన, చేతులు ఒకదానిమీద ఒక టేసుకొని,

కాళ్లు ఒకదాని మీద మరొకటొచ్చేట్టుగా నుంచుని, అతనికేసి కోపంగా చూస్తున్నాడు. ఆయన భంగిమ అతను చెప్పింది ఆయనకెంతమాత్రం అంగీకారయోగ్యమైనది కాదని తెలుపుతోంది. అతను చేతులు రెండూ ఎడంగా పెట్టి అరిచేతులు పైకుంచి, కాళ్లు ఎడంగా పెట్టి, ఆయనకేసి సిన్సియర్‌గా చూస్తూ ఆయన్నేదో అడుగుతున్నాడు. 'నేను చెప్పిందాంట్లో తప్పేమయినా ఉంటే చెప్పండి' అని అతను అడుగుతూండాలి. కిందకి దిగిన కనుబొమలు, తీక్షణంగా ఉన్న వదనం, కోపంగా చూసే చూపులూ చూస్తోంటే, ఆ పెద్దాయనకి అతనంటే ఏమాత్రం సదభిప్రాయం లేనట్టుగా అనిపిస్తోంది. నోరు తెరిచి మాటాడటం లేదుగానీ, నోరు తెరిస్తే మటుకు, తిట్టినతిట్టు తిట్టకుండా తిడతాడనిపిస్తోంది.

వాళ్ళకి కుడివైపున సోఫాలో కూచుని ఉన్నారు ఇద్దరు ఆడవాళ్ళు.

ఇద్దరూ ఒకరికి దగ్గిరగా మరొకరు కూర్చోవటం చూస్తోంటే –

వీళ్లిద్దరూ మంచి స్నేహితురాళ్లని తెలుసుకోవచ్చు. మీరు గమనించారో లేదో – ఇద్దరూ చేతుల్ని వెనక వైపుకి ఆనించి, ఒకర్నొకరు తాకుతున్నట్టుగా కూచున్నారు. ఇద్దరూ నిండుగా నవ్వుతున్నారు. ఎదురుగా ఉన్న మగాళ్లిద్దర్నీ వీళ్లు చూస్తున్నట్టే లేదు. వాళ్లిద్దరూ తీవ్ర వాగ్వివాదంలోకి దిగితే వీళ్లిద్దరి ఆశ్చర్యానికి అంతే ఉండదు.

ఎడంచేతివైపు కూర్చున్నామె ఎదురుగా నుంచుని ఉన్న యువకుడిపట్ల ఏమాత్రం ఆసక్తి చూపడం లేదు. చేతిమీద చెయ్యేసుకొని, కాలిమీద కాలేసుకొని కూర్చున్న ఆమె భంగిమ ఆ విషయాన్ని తెలియచేస్తోంది. ఇక ఆమె ముందునించున్న అతను ఆమె ఏమనుకొంటున్నదీ పట్టించుకోకుండా పైకెత్తిన చేతుల్ని గోపురాకృతిలో అమర్చి ఆమెతో ఏదో చెబుతున్నాడు. 'ఏమిటీ సుత్తి?' అని ఆమె లోలోపలే విసుక్కుంటూ ఉండి ఉంటుంది. ఆమెకి ఓపిక నశించిందా – ఆమె అతణ్ణి 'Get out!' అనొచ్చు – అతని ఆత్మవిశ్వాసానికి వేటుపడొచ్చు.

ఆ కొసనున్న వాళ్లని చూశారా? (బొమ్మ52)




52. 'నేను రెడీ !' ఆందోళన అనుమానం

మధ్యన నుంచున్న మగవాళ్లు ఒకళ్లకేసి మరొకళ్లు అనుమానంగా ఆందోళనగా చూసుకొంటున్నారు. ఆ బట్టతలున్న పెద్దాయన కళ్లద్దాల రిమ్ముల్లోంచి చూస్తున్నట్టుగా తన పక్కన నుంచున్నతనికేసి చూస్తున్నాడు. అతను కోటుజేబులో చెయ్యి పెట్టుకోడం – అవతలివ్యక్తి పట్ల అతనికున్న అనుమానాన్నీ, అపనమ్మకాన్నీ తెలియచేస్తోంది.

ఆయన పక్కనే నుంచున్న తను చూసే ఆందోళనపూరితమయిన చూపులు పక్కనున్నాయన తన మాటలకి ప్రతిస్పందించిన తీరుకి – అతను చాలా ఆందోళన చెందుతున్నాడనే విషయాన్ని తెలియచేస్తున్నాయి. కాళ్ళు ఒకదాని మీద ఒకటి ఆనించి బేలన్స్‌లేని విధంగా నిలబడిన తీరు కూడా అదే విషయాన్ని తెలియచేస్తోంది. వాళ్ళకి కొంచెం ఇవతలగా ఇద్దరు ఆడవాళ్లు సోఫాలో కూర్చుని ఉన్నారు. సోఫాకి కుడివైపున కూర్చున్నామె కాలుమీద కాలేసుకొని ఒక చేతిని పైకాలిమీద పెట్టి మరో చేతిని చెంపకానించి కూర్చుని ఉంది. అవతలామె చెబుతున్న విషయాన్ని గురించిన బాగోగులని ఆలోచిస్తున్న భంగిమ అది. ఎడం చేతివైపు కూర్చున్నామె అరిచేతులు

కనపడే విధంగా చేతులు రెండూ ఎడంగా పెట్టి కాళ్లు కూడా ఎడంగా ఉంచి, కుడిచేతివైపుగా కూర్చున్నామెకేసి చూస్తూ మాటాడుతోంది. ఆ భంగిమ ఆమె ఏదో సహాయాన్ని అర్థిస్తోందన్న విషయాన్ని చెబుతోంది.


మధ్యన నుంచున్నవాళ్ల కొంచెం అవతలగా ఒక యువకుడు నడుంకి ఇటూ అటూ చేతులేసుకొని, కాళ్లు కొద్దిగా ఎడంగా పెట్టి నుంచుని ఎదురుగా కుర్చీలో కూరున్నామెతో మాటాడుతున్నాడు. ఆ భంగిమ ఏదో చెయ్యడానికి అతను పడే సంసిద్ధతని తెలియచేస్తోంది. ఆమె కూడా కుర్చీ సీటు చివర ముందుకొంగి కూచుని అతనికేసి ఆసక్తిగా చూస్తోంది. ఎడంగా ఉన్న కాళ్లమీద తలానించి కాలిమడమల్ని పైకెత్తి కూచుంది.

ఆమె భంగిమ అతను చెప్పినట్టు చెయ్యడానికి తను సిద్ధంగా ఉన్నానన్న విషయాన్ని తెలియచేస్తోంది.

బహుశా అతను 'డాన్స్ చేద్దాం వస్తారా?' అని అడిగుంటాడు.

'O.K.' అని ఆమె తన సంసిద్ధతని తెలియచేసి ఉంటుంది.

హాల్లో ఆ మూలన ఇద్దరు వ్యక్తులు సోఫామీద కూర్చుని ఉన్నారు – గమనించారా? (బొమ్మ 53)




53. సుత్తి

ఎడంచేతివైపు కూర్చున్నతను కాలి మీద కాలేసుకొని, చేతులు తల వెనుక పెట్టుకొని, దర్జాగా కూర్చుని, ఏదో విషయం గురించి అనర్గళంగా మాటాడు తున్నాడు. అవతల వాణ్ణి సుత్తి (Bore) కొట్టేవాడి ఫోజు ఇది. తన సాధించిన ఘన కార్యాల గురించీ, సాధించబోయే ఘన కార్యాలగురించి – చెప్పిందే చెబుతూ, అవతలివాణ్ణి అదేపనిగా బాదడం

ఇతని ప్రత్యేకత. అతను చెప్పింది వినే ఓపిక ఏమాత్రం లేక, నీరసించిపోయి, సాగిలపడినట్టుగా కూర్చుని ఉన్నాడే – అతనే సుత్తికొట్టించుకోబడుతున్న దురదృష్టవంతుడు.

ఈ ఇద్దరి వ్యక్తుల్నీ చూశారా? (బొమ్మ 54)



54. సంఘర్షణ

ఇద్దరి మొహాల్లో ఆవేశం పొంగిపొర్లుతోంది. ఇద్దరూ ఏ విషయం గురించో వాదులాడుకొంటున్నారు.

కుడివైపునున్నతను తన కోపాన్ని అదుపులో పెట్టుకోవడం కోసం చేతులు వెనక్కి పెట్టుకొని నిలుచున్నాడు. పిడికిలి బిగించి ఉన్న చేతిని మరో చేత్తో పట్టుకొన్నాడు. ఎడం వైపునున్నతను తల వెనక్కి చెయ్యి పోనిచ్చి తన నిస్పృహని తెలియచేస్తున్నాడు. మాటామాటా పెరిగిందంటే కొట్లాటకి దారి తీయొచ్చు. కొట్లాటలో మొదటగా చెయ్యి చేసుకొనేది ఎడంవైపునున్నతనే అని అతని భంగిమ తెలియచేస్తోంది.


55. అభ్యర్థన అనుమానం సంసిద్ధత

వరండాలో ముగ్గురు మనుషులు నిల్చుని మాటాడుకొంటున్నారు. (బొమ్మ 55)

ఎడంచేతివైపు ఉన్నతను ఒక చేత్తో గ్లాసుపట్టుకొని, ఇంకోచేతిని కోటు జేబులో పెట్టుకొన్నాడు. కోటు బటన్స్ పూర్తిగా పెట్టు కొన్నాడు. చెప్పదలచుకొన్న దాన్ని ఆచితూచి చెప్పేవాళ్లు ఈ విధమైన భంగిమని ప్రదర్శిస్తూంటారు.

కుడివైపునున్నతను నడుంకి ఇటూ అటూ చేతులు పెట్టుకొని నిల్చున్నాడు. కోట్‌బటన్స్ పెట్టుకోకుండా ఫ్రీగా వదిలిపెట్టాడు. అంటే అతను ఎడంవైపు నున్నతనితో సహకరించడానికి సిద్ధంగా ఉన్నాడు. మధ్యనున్న తను ఫేంటు జేబుల్లో చేతులు పెట్టుకొని నుంచున్నాడు. కోట్ బటన్స్ పూర్తిగా పెట్టు కొన్నాడు. అంటే అతను ఎడంవైపునున్నతను చెబుతున్నదాంతో ఏకీభవిం చడం లేదు.

# 14 చిన్న పరీక్ష

**ప**రీక్ష పెడితేగానీ మీ పరిజ్ఞానం తెలియదుగా –

బాడీ ల్యాంగ్వేజ్‌కి సంబంధించిన మీ పరిజ్ఞానానికి చిన్న పరీక్ష ఇది.

అయిదుగురు అమ్మాయిల బొమ్మలివి. (56, 57, 58, 59, 60 బొమ్మలు)



56. బొమ్మ   57. బొమ్మ   58. బొమ్మ   59. బొమ్మ   60. బొమ్మ

ఇలాంటి అమ్మాయిలు ఫంక్షన్స్‌లోనూ పార్టీలోనూ కనపడుతూనే ఉంటారు.

వీళ్ల శరీర భంగిమల బట్టి వీళ్ల మనోభావాల్ని క్లుప్తంగా పది నిముషాల్లో వ్రాయండి.

అయిదుగురి మనోగతాలూ కరెక్టుగా వ్రాస్తే పది మార్కులు వస్తాయి.

(5 × 2 )

O.K.? వ్రాయడం మొదలు పెట్టండి.

వ్రాయడం పూర్తిచేశాక మీ జవాబుల్ని కిందనిచ్చిన జవాబులతో సరిచూసుకొని మార్కులు వేసుకోండి.

**జవాబులు :**



**బొమ్మ 56 :** ఒక చేతిని చెంపకానించి, మరో చేతిని మోకాలిమీదుంచి, 'ఇక్కణ్ణుంచి బయటపడ్డం ఎలాగరా భగవంతుడా? అన్నట్టుగా చూస్తూ, సాగిలపడి కూర్చున్న ఈ అమ్మాయి భంగిమ విసుగుదల (Boredom) ని తెలియచేస్తోంది.



**బొమ్మ 57 :** షోగ్గా తయారయ్యి – స్టైలిష్‌గా కాలిమీద కాలేసుక్కూర్చుని – మోకాళ్ళమీద చేతులానించి – ఎవరికేసో ఆసక్తిగా చూస్తున్న ఈ అమ్మాయి భంగిమ 'నువ్వంటే నాకిష్టం!' అన్న మనోభావాన్ని తెలియచేస్తోంది.



**బొమ్మ 58 :** చేతులు ఒకదానిమీద ఒకటేసుకొని, భుజాన్నీ నడుము భాగాన్నీ చేతివేళ్ళతో గట్టిగా పట్టుకొని, ఆకాలిటూ ఈకాలటూ వచ్చేలా నిలబడి, అయిష్టంగా చూస్తున్న, ఈమె భంగిమ అవతలివ్యక్తిపట్ల తిరస్కార భావాన్ని చూచిస్తోంది.



**బొమ్మ 59 :** ఒకచేత్తో జుట్టుని సవరించుకొంటూ, మరోచేతి బొటనవేలిని బెల్ట్ వెనగ్గా పోనిచ్చి, మిగిలిన వేళ్లని ఇవతలికి సుతారంగా వదిలేసి, చక్కగా డ్రెస్ చేసుకొని, కిందికి సిగ్గుతో నేలచూపులు చూస్తున్న ఈ అమ్మాయి శరీర భంగిమ అవతలి వ్యక్తిని తను ప్రేమిస్తున్నాననే విషయాన్నీ, తనమీద తనకున్న నిగ్రహాన్ని తెలియచేస్తోంది.



60. బొమ్మ

**బొమ్మ 60 :** టేబులుమీద ఇటూ అటూ చేతులు పెట్టి ఎవరికోసమో ఎదురు చూస్తున్న ఈమె శరీర భంగిమ ఆ వ్యక్తిపట్ల తనకిగల విపరీతమైన అభిమానాన్ని తెలియచేస్తోంది.

# 15 ఇంటర్వ్యూలు

ఉద్యోగానికి ఇంటర్వ్యూ జరుగుతోంది.

అడిగిన ప్రశ్నలన్నిటికీ కరెక్టుగా జవాబులిచ్చాడు అభ్యర్థి.

చివరగా ఏంటానిమ్స్ (వ్యతిరేకార్థపదాలు) చెప్పమని అడిగాడు.

అవీ కరెక్టుగానే చెబుతున్నాడు. కానీ ఒకటి తప్పుగా చెప్పాడు.

"You are wrong" అన్నాడు ఇంటర్వ్యూ చేసే అతను.

"Wrong' అనే పదానికి ఏంటానిమ్స్ చెప్పమంటున్నాడేమో అనుకొని "I am right" అని జవాబిచ్చాడు.

ఇంటర్వ్యూయర్‌కి చిరాకేసింది. "Get out" అన్నాడు.

"Get out" కి ఏంటానిమ్ చెప్పమంటున్నాడేమో అనుకొని "Come in" అని జవాబిచ్చేడు.

ఈసారి ఇంటర్వ్యూయర్‌కి చిఱ్ఱెత్తుకొచ్చింది.

అభ్యర్థికేసి కోపంగా చూస్తూ "You are rejected" అన్నాడు.

దానిక్కూడా ఏంటానిమ్ చెప్పమంటున్నాడేమో అనుకొని "I am selected" అని జవాబిచ్చాడు.

అతణ్ణి ఉద్యోగానికి సెలక్ట్ చెయ్యక తప్పలేదు ఇంటర్వ్యూయర్‌కి.

ఉద్యోగాలకి అభ్యర్థుల్ని ఎంపిక చేసే కార్యక్రమంలో ఇంటర్వ్యూకి చాలా ప్రాధాన్యత ఉంటుంది.

ఇంటర్వ్యూ చేసేటప్పుడు, ఇంటర్వ్యూయర్ అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్ని మాత్రమే కాక అతని సమయస్ఫూర్తినీ, శరీరకదలికల్నీ కూడా లెక్కలోకి తీసుకొంటూంటారు. ఈ మూడు విషయాల్లోనూ సంతృప్తి కలిగినప్పుడు మాత్రమే అభ్యర్థికి ఎక్కువ మార్కులు వేస్తాడు.

మంచి విషయ పరిజ్ఞానం, సమయస్ఫూర్తి, బాడీల్యాంగ్వేజ్‌ని గురించిన అవగాహన ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలో అద్భుతంగా రాణిస్తారు.

ఇంటర్వ్యూ చేసేవాళ్ళ బాడీ లేంగ్వేజ్ ఎలా ఉంటుందో, అభ్యర్థుల బాడీ ల్యాంగ్వేజ్ ఎలా ఉండాలో తెలుసుకొందామా?

ఇంటర్వ్యూ జరిగే సమయంలో అభ్యర్థి అడిగిన ప్రశ్నలకి జవాబులిస్తూనే ఇంటర్వ్యూయర్ బాడీ లేంగ్వేజ్ ఎలా ఉందో గమనించాలి.

ఇంటర్వ్యూయర్స్ అభ్యర్థుల పెరఫార్మెన్స్ (జవాబులు చెప్పే పద్ధతి) బట్టి వారి ప్రతిభా సామర్థ్యాలను అంచనా వేసేటప్పుడు, రకరకాల శరీర భంగిమల్ని ప్రదర్శిస్తుంటారు.

కొంతమందుంటారు. వీళ్లు కొద్దిగా ముందుకు వంగి కూర్చుని, చెంపకి చేతినానించి, అభ్యర్థికేసి సునిశితంగా చూస్తూ, నిశితంగా అతను చెప్పిన సమాధానాల గురించి ఆలోచిస్తూంటారు (బొమ్మ 61).



61. Evaluation gesture -ఆలోచన

వీళ్లు మార్కుల్ని తక్కెడలో పెట్టి తూచి వేస్తున్నట్టుగా వేస్తారు.

ఇలాంటివాళ్లు తగిలినప్పుడు అభ్యర్థులు తమ సమాధానాల్ని ఏమాత్రపు అనుమానాలకీ అవకాశం ఇవ్వకుండా అతి జాగ్రత్తగా చెప్పాలి.

ఇక మరొకరకం ఇంటర్వ్యూయరుంటాడు. ఇతను కొద్దిగా ముందుకొంగి, గెడ్డం మీద చేతినానించి,చూపుడువేలితో గెడ్డాన్ని తాటిస్తూ, అభ్యర్థికేసి సాలోచనగా చూస్తూ అతణ్ణి గురించి అంచనా వేస్తూంటాడు (బొమ్మ 62). ప్రతి విషయాన్నీ అన్ని కోణా ల్లోంచీ ఆలోచిస్తూ తను చేస్తున్న పనికి న్యాయం చేకూర్చాలనుకొనే వ్యక్తి ఇతను. ఇటువంటి తరహా వ్యక్తివలన అభ్యర్థికి న్యాయమే జరుగుతుందిగానీ అన్యాయం జరగదు. ఇటువంటి వ్యక్తి ఇంటర్వ్యూయర్‌గా ఉన్నప్పుడు అభ్యర్థి ఆత్మ విశ్వాసంతో సమాధానాలు చెప్పొచ్చు.



62. The chin stroking evaluation
'అతను చెప్పిందాంట్లోనూ పాయింటుంది'

కొంతమంది వ్యక్తులుంటారు. వీళ్ళు తమ హావభావాల్ని తమ కళ్ళజోళ్ళ ద్వారా తెలియచేస్తూంటారు.



63. What was that again
- 'మళ్లీ ఏం జరిగింది?'

ఇతణ్ణి చూడండి. ముక్కు చివర ఆనిం చిన కళ్ళజోళ్లోంచి అభ్యర్థికేసి నిశితంగా చూస్తూంటాడు. 'నువ్వు చెప్పింది రైటే అనుకొంటున్నావా?' అనే భావాన్ని వ్యక్తం చేస్తూ (బొమ్మ 63) ఇతని ముక్కు చివరగా ఆని ఉన్న కళ్ళజోడు అటువంటి భావాన్ని వ్యక్తంచేస్తే చెయ్యొచ్చుగానీ ఇతను స్వతహాగా అవతలతణ్ణి తప్పు పట్టడమే ధ్యేయంగా పెట్టుకొన్న మనిషి కాకపోవచ్చు. ఇలాంటి వ్యక్తి ఇంటర్వ్యూయర్‌గా ఉన్నప్పుడు అభ్యర్థి లేనిపోని అనుమానాలు పెట్టుకోకుండా తనకి తెలిసున్న సమాధానాల్ని తడబడకుండా చెప్పడం మంచిది.

ఈ ఇంటర్వ్యూయర్‌ని చూండి –

కళ్లజోడుతీసి, కళ్లజోడు కాడని నోటికి తగిలిస

నేల చూపులు చూస్తున్నాడు (బొమ్మ 64).

ఇతని భంగిమ అభ్యర్థిని గురించి ఒక అంచనాకి రావడానికి ఇతనికింకా టైమ్ కావాలనే విషయాన్ని తెలియచేస్తోంది. ఇటువంటి భంగిమని చూసినప్పుడు అభ్యర్థి తన మాటల లోగానీ ప్రవర్తనలోగానీ ఏమాత్రపు అసహనాన్నీ ప్రదర్శించకుండా అతను చెప్పేదాని కోసం ఎదురుచూడాలి.



64. Gaining time to evaluate - **టైమ్ తీసుకునే పద్ధతి**



65. It is hard for me to see the answer - **ఏం చెయ్యాలి చెప్మా?**

ఇంకొకరకం ఇంటర్వ్యూయర్ ఉంటాడు. ఇతను అభ్యర్థి చెప్పే సమాధానాల్ని గురించి కళ్లు మూసుకొని ముక్కుమీదకి చేతివేళ్లు పోనిచ్చి ఆలోచిస్తూంటాడు (బొమ్మ 65).

ఇతను చాలా సున్నిత మనస్కుడు. తను తీసుకొనే నిర్ణయంలో ఏమాత్రపు పొరబాటు జరిగినా అభ్యర్థి నష్టపోతాడేమో అన్న బాధని ఇతని భంగిమ వ్యక్తపరుస్తూంటుంది. అటువంటి భంగిమని చూసినపుడు అభ్యర్థి ఓపిగ్గా అతను ఏం చెబుతాడో అని ఎదురు చూడాలి.

ఇంటర్వ్యూయర్స్ అభ్యర్థులను గురించి వేసిన అంచనాల బట్టే అభ్యర్థులకి మార్కులొస్తాయి.

ఇక – అభ్యర్థులు తాము నిలుచున్నా, కూర్చున్నా నడుస్తున్నా తాము erect గా (నిటారుగా) ఉండేట్టుగా చూసుకోవాలి.

ఒక మనిషి erect గా నిలుచున్నప్పుడుగానీ, కూర్చున్నప్పుడుగానీ, నడిచి నప్పుడుగానీ అతనిలో ఆత్మవిశ్వాసం పెరుగుతూంటుంది. ఆత్మవిశ్వాసం మనిషిని విజయతీరాలవైపు నడిపిస్తుంది.

ఇక చేతులు ఫ్రీగా వదలాలి. పిడికిళ్లు ఏ సందర్భంలోనూ బిగించి ఉండ కూడదు.

కూర్చున్నప్పుడుగానీ నిలుచున్నప్పుడు గానీ కాళ్లూపడం, గోళ్లు కొరుక్కోవడం లాంటివి చెయ్యకూడదు.

నిలుచున్నప్పుడుగానీ, కూర్చున్నప్పుడుగానీ, కాళ్లు ఫ్రీగా ఉండేటట్టు, కొద్దిగా ఎడంగా పెట్టుకోవాలి.

చూపుల్లో ప్రశాంతత ఉండాలి.

కళ్ళలో ఆందోళన, ఆతృత, నిరాశవంటి భావాల్ని కనపడనీయకుండా జాగ్రత్త పడాలి.

మొహంమీద చిరునవ్వు చెరగనియ్యకుండా చూసుకోవాలి.

ఇంటర్వ్యూ చేసే వ్యక్తులు ప్రదర్శించే భంగిమలు తమకు వ్యతిరేకమైనవిగా ఉన్నప్పుడు, సమయోచితంగా మాటాడుతూ వ్యవహరిస్తూ, అవతలి వ్యక్తి లోని వ్యతిరేక భావనని పోగొట్టటానికి ప్రయత్నించాలి.

ఇంటర్వ్యూలకి వెళ్లే అభ్యర్థులు ఈ సూచనల్ని పాటిస్తే విజయం వాళ్లదే.

# కృతజ్ఞతలు

బాడీ లేంగ్వేజ్‌కి సంబంధించిన ఈ రచనని చెయ్యడానికి నాకీ పుస్తకాలు ఉపయోగపడ్డాయి.

1. Gerard L. Nierenberg and Henry H. Calero రచించిన How to read a person like a book.
2. Fast Julius రచించిన Body Language.
3. Bacon Albert రచించిన A Manual of gestures.
4. Goffruan Eruring రచించిన Behaviour in Public Places.
5. P.R.E. Hockett and Danely J.J. రచించిన The First Five Minutes.

ఈ రచయితలందరికీ నేను కృతజ్ఞతలు తెలియచేసుకొంటున్నాను.

**- డి.ఎ. సుబ్రహ్మణ్యశర్మ**